

అర్జీలు స్వీకరిస్తున్న అదనపు కలెక్టర్ విజయేందర్‌రెడ్డి

ప్రజావాణిలో 80 ఫిర్యాదులు

» స్వీకరించిన అదనపు కలెక్టర్ విజయేందర్‌రెడ్డి

మేడ్చల్, జూలై 28(ఆంధ్రజ్యోతి ప్రతినిధి): ప్రజావాణి దృష్టికి వచ్చే సమస్యలను సంబంధిత అధికారులు సత్వరమే పరిష్కరించాలని అదనపు కలెక్టర్ విజయేందర్‌రెడ్డి సూచించారు. సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజావాణిలో లా ఆఫీసర్ చంద్రావతితో కలిసి ఆయన ఫిర్యాదులను స్వీకరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రజావాణి కార్యక్రమంలో ప్రజలు అందించే వినతులపై సంబంధిత శాఖల అధికారులు తక్షణమే స్పందిస్తూ వాటిని పరిష్కరించాలని ఆదేశించారు. అర్జీలను పెండింగ్‌లో పెట్టకుండా ఎప్పటికప్పుడు పరిశీలన జరుపుతూ, సమస్యలను పరిష్కరించాలని అధికారులకు సూచించారు. ప్రజావాణిలో మొత్తం 80 ఫిర్యాదులు అందినట్లు అధికారులు తెలిపారు. కార్యక్రమంలో వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

ఫిర్యాదులపై సత్వరం చర్యలు తీసుకోవాలి

వికారాబాద్, జూలై 28(ఆంధ్రజ్యోతి): ప్రజావాణిలో వచ్చే ఫిర్యాదులపై వేగంగా స్పందించాలని అదనపు కలెక్టర్ లింగ్యానాయక్ అధికారులకు సూచించారు. సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో 119 ఫిర్యాదులను స్వీకరించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ ఎక్కువగా భూ సమస్యలు, భూ సర్వే, పింఛన్లు తదితర అంశాలపై ఫిర్యాదులు వచ్చినట్లు పేర్కొన్నారు. ప్రతీ ఫిర్యాదును ప్రాధాన్యతతో తీసుకుని, పెండింగ్‌లో లేకుండా వెంటనే విచారణ చేసి పరిష్కరించాలని సంబంధిత శాఖల అధికారులను ఆదేశించారు. అలాగే తీసుకున్న చర్యల వివరాలను ఫిర్యాదుదారులకు తప్పనిసరిగా తెలియజేయాలని స్పష్టం చేశారు. కార్యక్రమంలో ఆర్డీవో వాసుచంద్ర, డీఆర్డీవో శ్రీనివాస్, వివిధ శాఖల జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

నేడు వికారాబాద్‌కు మంత్రి తుమ్మల



వికారాబాద్, జూలై 28 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): జిల్లా కేంద్రంలో నేడు నిర్వహించే ప్లాంటేషన్ కార్యక్రమానికి రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు హాజరు కానున్నారు. ఉదయం 10.30 గంటలకు వికారాబాద్ మున్సిపల్ పరిధిలోని శివారెడ్డిపేట పారిశ్రామికవాడ పక్కన జరిగే ఆయిల్ పామ్ ప్లాంటేషన్ కార్యక్రమానికి ఆయన స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్‌తో కలిసి హాజరుకానున్నారు. ఈ సందర్భంగా వారు ఆయిల్‌పామ్ మొక్కలు నాటనున్నారు.

సాంకేతిక పరిజ్ఞానం విద్యారంగంలోనూ కొత్త విప్లవం తీసుకువస్తోంది. బడుల్లో చెప్పే పాఠాలను అరచేతిలోని స్మార్ట్‌ఫోన్‌లోనూ వినే అవకాశం అందుబాటులోకి వచ్చింది. ఏదైనా కారణం చేత బడికి వెళ్లలేని పరిస్థితిలో కొందరు విద్యార్థులు పాఠాలను మిస్ అయినప్పుడు, అలాగే స్కూల్‌లో చెప్పిన పాఠం అర్థం కానప్పుడు చింతించాల్సిన అవసరం లేదు. ఇలాంటివారి కోసం 'దీక్ష' యాప్‌ను విద్యాశాఖ అందుబాటులోకి తీసుకువచ్చింది. స్మార్ట్ ఫోన్‌లో ఈ యాప్‌ను ఓపెన్ చేసి ఒక్క క్లిక్ చేస్తే మనకు కావాల్సిన పాఠాలను వినొచ్చు. ఇందులో 1- 10వ తరగతి వరకు పుస్తకాల్లోని పాఠ్యాంశాలన్నీ అందుబాటులో ఉంటాయి. పుస్తకంలోని క్యూఆర్ కోడ్ స్కాన్ చేస్తే చాలు పాఠ్యాంశానికి సంబంధించిన వీడియోను చూడొచ్చు.



ఒక్క క్లిక్‌తో..

స్మార్ట్ ఫోన్‌లో పాఠాలు ప్రత్యక్షం



అందుబాటులో ఒకటి నుంచి టెన్త్ క్లాస్ లెసన్స్

బుక్‌లో క్యూఆర్‌కోడ్ స్కాన్ చేస్తే వీడియో క్లాసులు

పలు భాషల్లో పాఠ్యాంశాలు వినేలా రూపకల్పన

విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న విద్యాశాఖ

విద్యార్థుల కోసం అమల్లోకి 'దీక్ష' యాప్

DIKSHA

(ఆంధ్రజ్యోతి, రంగారెడ్డి జిల్లా ప్రతినిధి)

ఏదైనా కారణం చేత స్కూల్‌కు వెళ్లలేక టీచర్లు చెప్పే పాఠాలు మిస్ అయ్యే విద్యార్థుల బాధలు అన్ని ఇన్నీ కావు. క్లాస్‌లుకు వెళ్లలేక పోయినందున తోటి విద్యార్థులతో పోటీలో వెనుకబడిపోతామని ఆవేదన చెందుతుండడం పరిపాటి. అయితే ఇక మీదట ఇలాంటి బాధలు పడాల్సిన పనిలేదు. తోటి విద్యార్థులపై ఆధారపడాల్సిన అవసరం ఎంత మాత్రం లేదు. తమకు కావాల్సిన సబ్జెక్టులోని పాఠాలను ఎప్పుడు అంటే అప్పుడు నిపుణులైన టీచర్లు చెప్పే వీడియో క్లాస్‌ల ద్వారా వినవచ్చు. ఇందుకోసం విద్యాశాఖ 'దీక్ష' అనే యాప్‌ను విద్యార్థుల కోసం అందుబాటులోకి తెచ్చింది. ఒకటి నుంచి 10వ తరగతి వరకు పాఠ్యపుస్తకాల్లోని పాఠ్యాంశాలన్నీ యాప్‌లో పొందుపరిచింది. పలు భాషల్లో ఈ పాఠ్యాంశాలు వినే విధంగా దీన్ని రూపకల్పన చేశారు. పాఠ్యపుస్తకాల్లోని క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేసి తమకు కావాల్సిన పాఠాలను ఈ దీక్ష యాప్ ద్వారా ఎన్నిసార్లు అయినా వినవచ్చు. విదార్థుల మానసిక స్థాయికి తగినట్లు దృశ్యరూపకంగా బోధన సాగుతుంది. ఒక్క క్లిక్‌తో

మిగతా 5వ పేజీలో...



మూలవిరాట్‌కు క్షీరాభిషేకం చేస్తున్న భక్తులు

కీసరగుట్టలో శ్రావణ పూజలు

కీసర రూరల్, జూలై 28 (ఆంధ్రజ్యోతి): మొదటి శ్రావణ సోమవారం సందర్భంగా కీసరగుట్ట శ్రీరామలింగేశ్వరస్వామి ఆలయంలో భక్తుల సందడి నెలకొంది. వేకువజాము నుంచే భక్తులు ఆలయానికి బారులు తీరారు. స్వామి వారిని పంచామృతాలతో అభిషేకించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. సంకటహర చతుర్థి కావడంతో విఘ్నేశ్వరునికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం పూజారులు భక్తులకు తీర్థ, ప్రసాదాలను పంపిణీ చేశారు. ఆలయ చైర్మన్ నారాయణశర్మ గుట్టపై సదుపాయాలను పర్యవేక్షించారు. ఓ దివ్యాంగ మహిళా భక్తురాలు అతి కష్టం మీద ఆలయానికి విచ్చేసి స్వామి వారిని దర్శించుకున్నారు. తిరిగి వెళ్లే సమయంలో ఆ భక్తురాలికి వీల్‌చైర్ ఏర్పాటు చేశారు.



పంచాయతీ వద్ద కేంద్ర ప్రతినిధులు

అభివృద్ధి పనుల పరిశీలన

కొడంగల్ రూరల్, జూలై 28 (ఆంధ్రజ్యోతి): కొడంగల్ మండల పరిధిలోని హుసేన్‌పూర్‌లో సోమవారం కేంద్ర బృందం ప్రతినిధులు జోసెఫ్, వినోద్‌లు పర్యటించారు. గ్రామంలో పంచాయతీ భవనం, సీసీ రోడ్లు, నర్సరీ, క్రీడా ప్రాంగణం, పశువుల షెడ్, భూమి చదును పనులను పరిశీలించారు. అనంతరం ఉపాధి హామీ కూలీలతో వారు మాట్లాడారు. కార్యక్రమంలో కొడంగల్ ఎంపీడీవో ఉషశ్రీ, ఏపీడీ సరళ, ఎంపీవో జైపాల్ రెడ్డి, పీఆర్ ఏఈ రవికిరణ్ రెడ్డి, ఏపీవో రాములు, డీఆర్‌డీఏ ఈసీ సైదులు, ఉష, ఏపీఎం వెంకన్న, టీఏ వెంకట్ రెడ్డి, కార్యదర్శులు కొండన్న, బాలరంగాచారి, కృష్ణ పాల్గొన్నారు.

నేడు తాండూరుకు డిప్యూటీ సీఎం

మంత్రి శ్రీధర్‌బాబు, స్పీకర్ ప్రసాద్ కుమార్ రాక

సభా ఏర్పాట్లను పరిశీలించిన ఎమ్మెల్యే బుయ్యని

రూ.220 కోట్ల విలువైన పనులకు శంకుస్థాపన



డిప్యూటీ సీఎం భట్టి



మంత్రి శ్రీధర్‌బాబు



స్పీకర్ ప్రసాద్‌కుమార్



సభా ఏర్పాట్లపై అధికారులతో చర్చిస్తున్న ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి

తాండూరు/పెద్దేముల్/యాలాల, జూలై 28(ఆంధ్రజ్యోతి): డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రి శ్రీధర్‌బాబు, స్పీకర్ గడ్డం ప్రసాద్ నేడు తాండూరు నియోజకవర్గానికి వస్తున్న నేపథ్యంలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో పార్టీ శ్రేణులు భారీ ఏర్పాట్లు చేశారు. స్వాగత తోరణాలు, ఫ్లెక్సీలు ఏర్పాటు చేశారు. మన్‌సాన్‌పల్లి నుంచి తాండూరు వరకు, తాండూరు నుంచి జుంటుపల్లి వరకు భారీ ఏర్పాట్లు చేశారు. వారు సుమారు రూ.220 కోట్ల విలువైన అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేయనున్నారు. యాలాల మండలం దౌలాపూర్‌లో రూ.200 కోట్ల వ్యయంతో నిర్మించే ఇంటిగ్రేటెడ్ స్కూల్, రూ.20 కోట్ల వ్యయంతో చేపట్టే ఆరు విద్యుత్ సబ్ స్టేషన్‌ల నిర్మాణనాకి శంకుస్థాపన చేయనున్నారు.

సభను విజయవంతం చేయాలి

పెద్దేముల్ మండలం కందనెల్లి సమీపంలోని జీవీఆర్ గార్డెన్‌లో జరిగే పబ్లిక్ మీటింగ్‌ను విజయవంతం చేయాలని ఎమ్మెల్యే బుయ్యని మనోహర్‌రెడ్డి నాయకులు,

మిగతా 6వ పేజీలో...

వెనుకబడిన ప్రాంతంపై దయ చూపండి

» పెండింగ్ పనులకు ఆర్థిక క్లియరెన్స్ ఇవ్వండి

ప్రభుత్వంలో కీలకమైన ఆర్థిక, విద్యుత్ శాఖతో పాటు ఉప ముఖ్యమంత్రి బాధ్యతలు నిర్వర్తిస్తున్న భట్టి విక్రమార్క మంగళవారం తాండూరు పర్యటనకు వస్తున్న సందర్భంగా వెనుకబడిన తాండూరు ప్రజలు ఆయనపై ఎన్నో ఆశలు పెట్టుకున్నారు. మొదటిసారి పర్యటనకు వస్తున్న సందర్భంగా తాండూరుకు వరాలు కురిపిస్తారని ఆశగా ఎదురుచూస్తున్నారు. రైతుల కోసం కంది బోర్డు, కాగ్నా కాక్రవేణి నదుల ఆధారంగా కొత్త ఎత్తిపోతల పథకాలు, కోట్‌పల్లి ఇరిగేషన్ ప్రాజెక్టు, నీళ్లపల్లి ఏకాంబరేశ్వర దేవాలయం పర్యటన కేంద్రాలుగా గుర్తింపు, అసంపూర్తిగా నిలిచిన డబుల్ బెడ్‌రూం ఇళ్ల నిర్మాణానికి నిధులు, తాండూరు ఆర్టీసీ బస్టాండ్ ఆధునికీకరణ, శివసాగర్, జుంటుపల్లి ప్రాజెక్టు ఆధునికీకరణకు నిధులు, ఇంజనీరింగ్ పాలిటెక్నిక్ మెడికల్ కళాశాల ఏర్పాటు, తాండూరు పట్టణంలో అండర్ గ్రౌండ్ డ్రైనేజీ నిర్మాణం, తాండూరు మున్సిపాలిటీలో జంక్షన్‌ల అభివృద్ధి, శ్మశాన వాటిక అభివృద్ధికి నిధులతో పాటు తాండూరు ప్రాంతానికి ప్రత్యేకంగా విద్యుత్ సబ్‌స్టేషన్, బషీరాబాద్ మండలం నవాంద్గిలో 132 కేవీ, కోట్‌పల్లిలో 220కేవీ సబ్‌స్టేషన్‌ల ఏర్పాటుకు నిధులు మంజూరు చేయాలని స్థానిక ప్రజలు కోరుతున్నారు.

యూరియా.. ఏదయా!

రైతులను వేధిస్తున్న కొరత

అదునుకు అందని ఎరువులు

ఇబ్బందులు పడుతున్న రైతులు

ఇతర ప్రాంతాలకు పరుగులు



పరిగిలోని ఆగ్రోస్ సెంటర్ వద్ద రైతుల నిరసన

జిల్లా రైతులను యూరియా కొరత వేధిస్తోంది. విస్తారంగా వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో సాగు విస్తీర్ణం పెరుగుతోంది. దీంతో యూరియా బస్తాల కోసం రైతులు దుకాణాల వద్దకు పరుగులు తీస్తున్నారు. అయితే సరఫరా తగ్గడంతో సరిపడా దొరకడం లేదు. పది రోజులుగా డీఏపీ, యూరియా కోసం ఫర్టిలైజర్ దుకాణాలకు వెళ్తున్న రైతులు నిల్వలు లేక నిరాశతో వెనుదిరుగుతున్నారు. కాగా, పలు విక్రయ కేంద్రాల్లో ఒక్క ఆధార్‌కు ఒకటి, రెండు బస్తాలు చొప్పున ఇస్తుండటం గమనార్హం.

-పరిగి, జూలై 28 (ఆంధ్రజ్యోతి)

కుళ్లిన చికెన్, పగిలిన కోడిగుడ్లు

బేకరీలు, హోటళ్లలో ముమ్మర తనిఖీలు.. అపరిశుభ్రతపై కమిషనర్ తీవ్ర ఆగ్రహం

ఘట్‌కేసర్, జూలై 28(ఆంధ్రజ్యోతి): ఘట్‌కేసర్‌లోని పలు బేకరీలు, హోటళ్లలో మున్సిపల్ కమిషనర్ రాజేశ్, సిబ్బందితో కలిసి సోమవారం తనిఖీలు నిర్వహించారు. ఈ తనిఖీల్లో విస్తుపోయే నిజాలు వెలుగులోకి వచ్చాయి. కుళ్లిపోయిన చికెన్, గుడ్లు ఫ్రిజ్‌లో పెట్టి వినియోగిస్తున్నట్లు గుర్తించారు. ప్రధానంగా ప్రిన్స్ బేకరీలోని అపరి శుభ్రత, తిను పదార్థాల తయారు చేసే చోట దుర్వాసన వస్తుండటంతో నిర్వాహకుడిపై కమిషనర్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. అలాగే ఉడికించి ఫ్రిజ్‌లో నిల్వ ఉంచిన గుడ్లను ఎగ్‌పఫ్‌లలో వినియోగిస్తున్నట్లు గుర్తించారు. అనంతరం పలు హోటళ్లు, కిరాణ దుకాణాలలోనూ తనిఖీలు నిర్వహించారు. పరిశుభ్రత పాటించని బేకరీల, హోటళ్ల నిర్వాహకులకు జరిమాన విధించారు. అలాగే నిషేధిత ప్లాస్టిక్ కవర్లు వినియోగిస్తున్న దుకాణాదారులకు సైతం జరిమానా విధించారు. మరోసారి పట్టుబడితే బేకరీలు, హోటళ్లను, దుకాణాలను సీజ్ చేసి కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. పరిశుభ్రత పాటించని హోటళ్లు, బేకరీల నిర్వాహకులకు రూ.16,500 జరిమానా విధించారు.



ప్రిన్స్ బేకరీలో తనిఖీ చేస్తున్న కమిషనర్ రాజేశ్

సీసీ కెమెరాలతో కేసుల ఛేదన సులభం

» వికారాబాద్ ఎస్పీ నారాయణరెడ్డి



మర్పల్లి, జూలై 28 (ఆంధ్రజ్యోతి): ఒక్క సీసీ కెమెరా వంద మంది పోలీసులతో సమానమని ఎస్పీ నారాయణరెడ్డి అన్నారు. సోమవారం మర్పల్లి పోలీస్‌స్టేషన్ ఆవరణలో దుకాణ యజమానులకు సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన సీసీ కెమెరాలపై అవగాహన కల్పించారు. సీసీ కెమెరాలు నేరాలను అరికట్టడంలో, కేసులను ఛేదించడంలో ఎంతో దోహదపడతాయన్నారు. గ్రామాల్లో ఏవైనా సంఘటనలు జరిగినప్పుడు సీసీ ఫుటేజీతో నిందితులను గుర్తించేందుకు అవకాశం ఉంటుందన్నారు. వ్యాపారులు సొసైటీగా ఏర్పాటు చేసుకొని ప్రధాన కూడళ్లు, దుకాణ సముదాయాల్లో సీసీ కెమెరాల ఏర్పాటుకు ముందుకు రావాలని సూచించారు. అదే విధంగా సైబర్ మోసాల పట్ల అప్రమత్తంగా ఉండాలని, ఫోన్‌లకు వచ్చే లింక్‌లను క్లిక్ చేసి మోసపోవద్దన్నారు. అత్యవసర సమయాల్లో ప్రజలు డయల్ 100ను సద్వినియోగం చేసుకోవాలన్నారు. వాహనదారుల ట్రాఫిక్ నిబంధనలు తప్పనిసరిగా పాటిస్తూ హెల్మెట్, సీటు బెల్టు, వాహనాలకు సంబంధించిన అన్నీ పత్రాలతో రోడ్లపై ప్రయాణించాలన్నారు. అనంతరం పోలీస్‌స్టేషన్‌లో రికార్డులు తనిఖీ చేసి పోలీసు సిబ్బందికి సూచనలు చేశారు. ఈ సందర్భంగా డీఎస్పీ శ్రీనివాస్, సీఐ వెంకటేశం, పోలీసు సిబ్బంది ఉన్నారు.

కనుల పండువగా గోదా కల్యాణం



గోదా కల్యాణ తంతు నిర్వహిస్తున్న వేదపండితులు



కల్యాణ కార్యక్రమానికి హాజరైన భక్తులు

ఘట్‌కేసర్ రూరల్, జూలై 28(ఆంధ్రజ్యోతి): ఘట్‌కేసర్ మున్సిపాలిటీ, ఎదులాబాద్‌లోని శ్రీ గోదా సమేత మన్నారు రంగనాయకస్వామి దేవాలయ బ్రహ్మోత్సవాల్లో భాగంగా సోమవారం రంగనాయకస్వామి, గోదాదేవి కల్యాణం వైభవంగా జరిగింది. ఉదయం స్వామి వారికి ప్రత్యేకపూజలు, అభిషేకాలు, అర్చనలు నిర్వహించారు. అనంతరం స్వామివారిని గరుడసేవలో భాగంగా గ్రామంలో ఊరేగించారు. సాయంత్రం ఆలయ అవరణలోని కల్యాణ మండపంలో రంగనాయక స్వామిని, గోదా అమ్మవారిని ప్రత్యేకంగా ఆలంకరించారు. ఎమ్మెల్యే చామకూర మల్లారెడ్డి దంపతులు స్వామివారికి పట్టు వస్త్రాలు, తలంబ్రాలు సమర్పించారు. కల్యాణం గురించి ఆలయ వంశస్తులు భక్తులకు వివరిస్తూ కల్యాణం జరిపించారు. మాంగళ్యంను భక్తులకు చూపించి మాంగళ్యధారణ జరిపించారు. అనంతరం ఒడిబియ్యం, గాజులు, చీరలు, పూలు, పండ్లు గోదా అమ్మవారికి సమర్పించారు. భక్తులకు తీర్థ ప్రసాదాలతో పాటు అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో ఆలయ వంశస్తులు, నాయకులు, గ్రామస్తులు, మహిళలు తదితరులు పాల్గొన్నారు.

బ్రిడ్జికి పడిన రంధ్రాన్ని పరిశీలించిన అధికారులు


బ్రిడ్జి ధ్వంసమైన చోట పరిశీలిస్తున్న నిపుణులు, అధికారులు

తాండూరు, జూలై 28(ఆంధ్రజ్యోతి): తాండూరు-కొడంగల్ మార్గంలోని కాగ్నా నది కొత్త బ్రిడ్జిపై పడిన రంధ్రాన్ని సోమవారం నిపుణులు, ఆర్అండ్‌బీ, నేషనల్ హైవే అథారిటీ అధికారులు పరిశీలించారు. నాణ్యత నిర్ధారణకు ల్యాబ్ టెస్ట్‌కు పంపించారు. గుంత ఏర్పడిన చోట వెంటనే మైక్రోఫైబర్ వేయాలని నిర్ణయించారు. ఈ వంతెన నిర్మాణం చేపట్టిన కాంట్రాక్టర్ కూడా అధికారులతో కలిసి పరిశీలనకు రావడం గమనార్హం. అధికారుల నిర్లక్ష్యమా? నాణ్యత లోపమా? అనే విషయమై పరిశీలించి తదుపరి చర్యలు తీసుకోనున్నారు. ఇప్పటికే ఈ విషయాన్ని ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి రోడ్లు భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. బాధ్యులపై కేసులు నమోదు చేయాలని ప్రాణాలతో చెలగాటం ఆడుతున్న వారిపట్ల కఠినంగా వ్యవహరించాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు. వంతెన నిర్మించి రెండేళ్లు కూడా పూర్తి కాలేదు. అప్పుడే వంతెన కూలే దశకు రావడంపై స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఆర్అండ్‌బీ ఎస్ఈ వసంత్‌కుమార్, ఈఈ శ్రీధర్‌రెడ్డి, డీఈ శ్రావణ్‌కుమార్,హైవే ప్రాజెక్టు మేనేజర్ డీఈ, నిపుణులు పరిశీలించారు.

విలువలకు పాటుపడిన నేత జైపాల్‌రెడ్డి


తలకొండపల్లిలో నివాళులర్పిస్తున్న ప్రభాకర్‌రెడ్డి, కాంగ్రెస్ నాయకులు

ఆమనగల్లు/కడ్తాల్/తలకొండపల్లి, జూలై 28(ఆంధ్రజ్యోతి): ప్రజాస్వామ్య విలువల పరిరక్షణ కోసం జీవితాంతం పరితపించిన వ్యక్తి సూదిని జైపాల్‌రెడ్డి అని, ఆయన చిరస్మరణీయుడని కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి అన్నారు. నమ్మిన సిద్ధాంతాలు, రాజకీయ విలువల కోసం పదవులను తృణప్రాయం వదిలేసిన రాజనీతజ్ఞుడని, దీక్షాదక్షుడు బహుముఖ ప్రజ్ఞాశాలి జైపాల్‌రెడ్డి అని కొనియాడారు. ఆమనగల్లు, కడ్తాల, తలకొండపల్లి మండలాల్లో సోమవారం కేంద్ర మాజీ మంత్రి, ఉత్తమ పార్లమెంటేరియన్, సీనియర్ కాంగ్రెస్ నాయకుడు, కల్వకుర్తి మాజీ ఎమ్మెల్యే జైపాల్‌రెడ్డి ఆరో వర్ధంతిని ఘనంగా నిర్వహించారు. మాజీ జెడ్పీటీసీ శ్రీపాతి శ్రీనివాస్‌రెడ్డి, మండల కాంగ్రెస్ అధ్యక్షులు జగన్, మానయ్య, బిచ్యానాయక్, డోకూరు ప్రభాకర్‌రెడ్డి, కిషన్‌రెడ్డిల ఆధ్వర్యంలో కాంగ్రెస్, ఇతర పార్టీల నాయకులు, కార్యకర్తలు పాల్గొని జైపాల్‌రెడ్డి చిత్రపటాలకు, విగ్రహానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. కడ్తాలలో ఎమ్మెల్యే నారాయణరెడ్డి, మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ గీతనర్సింహ, డీసీసీ అధికార ప్రతినిధి శ్రీనివాస్‌రెడ్డి, డీసీసీ ప్రధాన కార్యదర్శి బిక్యానాయక్, ఆమనగల్లులో మాజీ జెడ్పీటీసీ శ్రీనివాస్‌రెడ్డి, పీసీసీ సభ్యుడు ఆయిళ్ల శ్రీనివాస్‌గౌడ్, ఆమనగల్లు బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు నర్సింహ పాల్గొన్నారు. రాజకీయ విలువలకు పాటుపడిన వ్యక్తుల్లో జైపాల్‌రెడ్డి ఒకరని ఎమ్మెల్యే, నాయకులు అన్నారు. కల్వకుర్తి ఖ్యాతిని జాతీయ స్థాయిలో చాటిన వ్యక్తి సూదిని అన్నారు. ఆయా కార్యక్రమాల్లో నాయకులు వేణుగోపాల్, మంకీ శ్రీను, రవి, ఖలీల్, కాలె మల్లయ్య, దశరథం, యాదగిరిరెడ్డి, లక్ష్మయ్య, శంకర్, బిక్షపతి, నరేశ్‌నాయక్, కృష్ణనాయక్, అలీం, శ్రీనివాస్‌రెడ్డి, ఖాదర్, ప్రసాద్, మైసయ్య, శేఖర్‌గౌడ్, మహేశ్, సాయి, ఫరీద్, శ్రీకాంత్, రాందాస్,యాదయ్యగౌడ్ పాల్గొన్నారు. హైదరాబాద్‌లోని జైపాల్‌రెడ్డి ఘాట్ వద్ద బీజేపీ నాయకుడు ఆచారి, పీసీసీ కార్యదర్శి సూదిని రాంరెడ్డి, టీపీడీ నాయకుడు యాదిలాల్ నివాళులర్పించారు.


కడ్తాలలో జైపాల్‌రెడ్డి వర్ధంతి వేడుకల్లో ఎమ్మెల్యే నారాయణరెడ్డి, నాయకులు

ప్రమాదకరంగా వేలాడుతున్న విద్యుత్ తీగలు


పొలంలో తక్కువ ఎత్తులో వేలాడుతున్న తీగలు

బషీరాబాద్, జూలై 28(ఆంధ్రజ్యోతి): మండలంలోని నీళ్లపల్లిలలోని పొలాల్లో పలుచోట్ల విద్యుత్ తీగలు ప్రమాదకరంగా మారాయి. చేతికందే ఎత్తులో విద్యుత్ తీగలు వేలాడుతుండటంతో పొలాల్లో పనిచేసే రైతులు, కూలీలు భయభయంగా పనులు చేస్తున్నారు. విద్యుత్ తీగలను చూసి కూలీలు పనులకు వచ్చేందుకు జంకుతున్నారని రైతు పి.శ్రీనివాస్‌రెడ్డి వాపోయాడు. పొలాల్లో అస్తవ్యస్తంగా ఉన్న విద్యుత్ తీగలతో ఎప్పుడు ఏం జరుగుతుందోనని భయపడుతున్నామన్నారు. కింది స్థాయి అధికారులకు విన్నవించినా ఫలితంలేకుండాపోయిందన్నారు. సంబంధిత శాఖ ఉన్నతాధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు.

ఇందిరమ్మ రాజ్యంలోనే బడుగుల సంక్షేమం


శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే యాదయ్య, మధుసూదన్‌రెడ్డి

షాబాద్, జూలై 28(ఆంధ్రజ్యోతి): ఇందిరమ్మ రాజ్యంలోనే బడుగు, బలహీన వర్గాల ప్రజలకు సంక్షేమ ఫలాలు అందుతున్నాయని చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్య అన్నారు. షాబాద్ కస్తూర్బా గాంధీ బాలికల పాఠశాల, జూనియర్ కళాశాలలో రూ.3.5 కోట్లతో నిర్మించే అదనపు గదులు, ల్యాబ్ భవనానికి శంకుస్థాపన చేశారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో మొక్కలు నాటారు. అనంతరం ఎంపిడివో కార్యాలయంలో లబ్దిదారులకు రేషన్‌కార్డులు, సీఎం రిలీఫ్‌ఫండ్ చెక్కులను జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ ఎలుగంటి మధుసూదన్‌రెడ్డి, గుడిమల్కాపూర్ ఏఎంసీ వైస్‌చైర్మన్ కావలి చంద్రశేఖర్‌లతో కలిసి పంపిణీచేశారు. వారు మాట్లాడుతూ.. బీఆర్ఎస్ పాలనలో ఒక్క రేషన్ కార్డయినా ఇవ్వలేదని, ప్రజలందరి సహకారంతో ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేద్దామన్నారు. వన మహోత్సవంలో భాగంగా ప్రతీ ఒక్కరు మొక్కలు నాటి వాటిని పరిరక్షించాలన్నారు.వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో అపర్ణ, ఎంఈవో లక్ష్మణ్‌నాయక్, డీటీ మధు, సీనియర్ అసిస్టెంట్ కృష్ణయ్య, నాయకులు చెన్నయ్య, అశోక్, జనార్దన్‌రెడ్డి, నరేందర్‌రెడ్డి, జంగయ్య, నర్సింహులు, శ్రీనివాస్‌గౌడ్, మహేందర్‌గౌడ్, లింగం, రవీందర్, యాదగిరి, ఖాజామియా, రాహుల్‌గుప్తా పాల్గొన్నారు.

నీటి సమస్య పరిష్కారానికి కృషి


బోరు వేయిస్తున్న నాయకులు

చేవెళ్ల, జూలై 28 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో నీటి సమస్య పరిష్కారానికి కృషి చేస్తామని చేవెళ్ల పీఏసీఎస్ చైర్మన్ డి.వెంకట్‌రెడ్డి, కాంగ్రెస్ జిల్లా ఉపాధ్యక్షుడు ఆగిరెడ్డి అన్నారు. సోమవారం చేవెళ్ల పరిధి మల్కాపూర్ గ్రామంలో సోమవారం బోరు డ్రిల్ చేయించారు. గ్రామస్తులు వారిని సన్మానించారు. మాజీ సర్పంచ్‌లు శేరి శివారెడ్డి, రమేశ్‌గౌడ్, రెడ్డిశెట్టి మధుసూదన్‌గుప్తా, సొసైటీ డైరెక్టర్ మధుసూదన్‌రెడ్డి, నాయకులు యాదిరెడ్డి, శ్రీనివాస్, ఖదీర్‌పాషా, చోటు, సాయికిరణ్‌గౌడ్, ఫారుక్ ఉన్నారు.

కేజీబీవీని తనిఖీ చేసిన డిప్యూటీ డీఎంహెచ్‌వో


విద్యార్థినులకు అవగాహన కల్పిస్తున్న డిప్యూటీ డీఎంహెచ్‌వో రవీందర్‌యాదవ్

కొడంగల్/దుద్యాల, జూలై 28(ఆంధ్రజ్యోతి):కొడంగల్, దుద్యాల మండల కేంద్రాల్లోని కేజీబీవీ పాఠశాలలను డిప్యూటీ డీఎంహెచ్‌వో రవీందర్‌యాదవ్ సోమవారం తనిఖీ చేశారు. విద్యార్థినుల ఆరోగ్య సమస్యలను గుర్తించి అవసరమైన మందులను పంపిణీ చేశారు. హైపటైటిస్ వ్యాధిపై అవగాహన కల్పించి తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. పాఠశాలల వంట గది, స్టోర్ రూమ్‌ను పరిశీలించారు. సీజనల్ వ్యాధులురాకుండా జాగ్రత్తలు పాటించాలని సూచించారు. విద్యార్థినులకు మెనూ ప్రకారం భోజనం అందించాలని ప్రిన్సిపాళ్లకు సూచించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ రాధిక, వైద్యులు వందన, సౌమ్య, బుష్ర ఫాతీమా, మహేందర్, వైద్య సిబ్బంది పకీరప్ప, మధుసూదన్ రెడ్డి, చంద్రకళ, ఏఎన్ఎంలు షాహీదా, వజ్రమాల పాల్గొన్నారు.

మోడల్ స్కూల్‌ను సందర్శించిన డీఈవో


ఉపాధ్యాయులతో మాట్లాడుతున్న డీఈవో రేణుకాదేవి

నవాబుపేట, జూలై 28(ఆంధ్రజ్యోతి): నవాబుపేటలోని మోడల్ స్కూల్‌లో బియ్యం, నీళ్లలో పురుగులు వస్తున్నాయని సోమవారం సామాజిక మాధ్యమల్లో వైరల్ కావడంతో డీఈవో రేణుకాదేవి స్పందించారు. సోమవారం పాఠశాలను తనిఖీ చేశారు. విద్యార్థులతో మాట్లాడి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులకు అందించే భోజనంలో నాణ్యత లోపిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. డీఈవో వెంట ఎంపీడీవో అనురాధ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న 'మాకు స్వాతంత్య్రం కావాలి'


నాటకాన్ని ప్రదర్శిస్తున్న బాలికలు

షాద్‌నగర్ అర్బన్, జూలై 28 (ఆంధ్రజ్యోతి): 'మాకు స్వాతంత్య్రం కావాలి' అనే చిన్న నాటక ప్రదర్శన గొప్ప సందేశం ఇచ్చిందని నాటక రచయిత, దర్శకుడు టీవీ రంగయ్య అన్నారు. ఏపీలోని కర్నూల్ టీజీవీ కళాక్షేత్రంలో ఆదివారం రాత్రి 'మాకు స్వాంతంత్య్రం కావాలి' అనే సాంఘిక నాటకాన్ని షాద్‌నగర్‌కు చెందిన బాలికలు పదర్శించారని తెలిపారు. లలిత కళాసమితి ఆధ్వర్యంలో నాటిక ప్రదర్శన జరిగిందన్నారు. అత్త ఒకింటి కోడలే అన్న విషయాన్ని మరిచి, కోడళ్లను కట్న కానుకల కోసం వేధించే అత్తకు కనువిప్పు కల్గించే ఆశంతో ప్రదర్శించిన నాటకం అలరించి, అభినందనలు పొందిందని తెలిపారు. ఈ సందర్భంగా నాటికంలో పాల్గొన్న బాలికలను అభినందించారు.

సీపీఐ మహాసభలను విజయవంతం చేయాలి

చేవెళ్ల, జూలై 28(ఆంధ్రజ్యోతి):సీపీఐ జిల్లా 17వ మహా సభలను విజయవంతం చేయాలని సీపీఐ కార్యవర్గ సభ్యుడు ప్రభులింగం పిలుపునిచ్చారు. సోమవారం చేవెళ్లలో మండల కార్యదర్శి సత్తిరెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. మహాసభలను మొయినాబాద్‌లో వచ్చే నెల 2వ తేదీన నిర్వహిస్తామని తెలిపారు. ముఖ్య అతిథిగా సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు, సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు పల్లా వెంకట్‌రెడ్డి హాజరవుతారని చెప్పారు. పార్టీ, ప్రజా సంఘాలనాయకులు హాజరై సభలను విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు సుభాన్‌రెడ్డి, ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి సత్యానారాయణచారి, మక్బూల్, షౌరీలు, పోచయ్య, సత్యనారాయణ, మీనాక్షి, లలిత, మంజుల, పెంటయ్య, మల్లయ్య ఉన్నారు.

ఆసుపత్రిలో మరమ్మతులు పూర్తిచేయాలి


ఆస్పత్రి మరమ్మతులపై సూచనలిస్తున్న కలెక్టర్ ప్రతీక్ జైన్

వికారాబాద్, జులై 28(ఆంధ్రజ్యోతి):ఏరియా ఆసుపత్రిలో మరమతులను త్వరితగతిన పూర్తిచేయాలని కలెక్టర్ ప్రతీక్‌జైన్, వైద్యశాఖ అధికారులకు సూచించారు. సోమవారం వికారాబాద్‌లోని పాత ఏరియా ఆసుపత్రిని తనిఖీ చేశారు. వార్డులు, వాష్ రూమ్‌లను పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ ఆసుపత్రి అవసరమైన విభాగాలను అన్నింటిని ఏర్పాటు చేసుకొని ప్రజలకు వైద్యసేవలందించేలా తీర్చిదిద్దాలన్నారు. ఆస్పత్రి బిల్డింగ్‌కు వేస్తున్న పెయింట్‌వర్క్‌ను పూర్తిచేసి మైనర్ మరమ్మతులను చేయించి అందుబాటులోకి తీసుకురావాలని అధికారులను ఆదేశించారు. కలెక్టర్ వెంట పీఆర్‌ఈఈ ఉమేశ్, సూపరింటెండెంట్ రాజ్యలక్ష్మి ఉన్నారు.

ఆరో తరగతి, ఇంటర్‌లో స్పాట్ అడ్మిషన్లు


మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ శ్రీదేవి

తాండూరు రూరల్, జూలై 28(ఆంధ్రజ్యోతి):మండలంలోని ఐనెల్లి శివారులోని తెలంగాణ ఆదర్శ పాఠశాల, కళాశాలలో స్పాట్ అడ్మిషన్లు తీసుకుంటున్నట్లు ప్రిన్సిపాల్ శ్రీదేవి తెలిపారు. సోమవారం ఆమె మాట్లాడుతూ.. ఆరో తరగతిలో 20సీట్లు, ఇంటర్ మొదటి సంవత్సరంలో 40సీట్లు ఖాళీగా ఉన్నాయని తెలిపారు. విద్యార్థులు టీసీ, బోనఫైడ్, కులం, ఆదాయం సర్టిఫికెట్లతోపాటు ఆధార్ కార్డుతో పాఠశాలకు హాజరు కావాలని తెలిపారు. వివరాలకు 9640896666 నంబర్లో సంప్రదించాలని కోరారు.

హాస్టల్లో సదుపాయాలు కల్పిస్తాం


హాస్టల్ పరిసరాలను పరిశీలిస్తున్న ఎంపీడీవో, ఎంఈవో, పీఆర్ ఏఈలు

మోమిన్‌పేట్, జూలై 28(ఆంధ్రజ్యోతి): చంద్రాయన్‌పల్లిలోని కస్తూర్బాగాంధీ హాస్టల్, కళాశాలలో విద్యార్థినులకు సదుపాయాల కల్పనకు కృషిచేస్తామని ఎంపీడీవో విజయలక్ష్మి చెప్పారు. సోమవారం అధికారులతో కలిసి సందర్శించారు. తరగతి గదుల మరమ్మతులు చేయిస్తామని తెలిపారు. మరుగుదొడ్లు, మురుగు కాల్వల నిర్మాణం, కిచెన్‌షెడ్డు, తాగు నీటి సదుపాయం, ప్రహరీ, విద్యుత్ సమస్యలను పరిశీలించారు. వారంలో ఒకసారి విద్యార్థులు, వంట ఏజెన్సీ మహిళలకు వైద్య పరీక్షలు చేయించాలన్నారు. సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉంటూ జాగ్రత్తలు పాటించాలన్నారు. కార్యక్రమంలో ఎంఈవో మల్లేశం, పీఆర్ ఏఈ ప్రణీత్, వైద్యాధికారి సుజలజయ్, ప్రత్యేకాధికారి టీచర్లు పాల్గొన్నారు.

త్రీఫేస్ ట్రాన్స్‌ఫార్మర్ల బిగింపు



మరమ్మతులు చేస్తున్న అధికారులు, సిబ్బంది

బంట్వారం, జూలై 28(ఆంధ్రజ్యోతి):సుల్తాన్‌పూర్‌లో త్రీఫేస్ విద్యుత్ రాక ప్రజలు పడుతున్న ఇబ్బందులపై అధికారులు స్పందించారు. సోమవారం 'విద్యుత్ కనెక్షన్‌కు ఎదురుచూపులు' శీర్షికన ఆంధ్రజ్యోతిలో కథనం ప్రచురితమైంది. దీంతో అసెంబ్లీ స్పీకర్ ప్రసాద్‌కుమార్ విద్యుత్ అధికారులకు ఫోన్‌చేశారు. అధికారులు స్పందించి తాత్కాలిక దిమ్మె ఏర్పాటుచేసి విద్యుత్ సరఫరా చేశారు. త్వరలోనే శాశ్వతంగా దిమ్మెను ఏర్పాటు చేస్తామని లైన్‌మన్ ఇక్రం తెలిపారు.

24గంటలూ వైద్య సేవలందించాలి

ఇబ్రహీంపట్నం, జూలై 28 (ఆంధ్రజ్యోతి): ఇబ్రహీంపట్నం సీహెచ్‌సీలో 24గంటలు వైదులు అందుబాటులో ఉండి వైద్య సేవలు అందించాలని బీజేపీ మున్సిపల్ శాఖ ఆధ్వర్యంలో సోమవారం ఇబ్రహీంపట్నం ప్రజావాణిలో తహసీల్దార్ సునీతారెడ్డికి వినతిపత్రం ఇచ్చారు. పరిస్థితుల్లో రోగులు ప్రైవేటు ఆసుపత్రులను ఆశ్రయిస్తున్నారని పార్టీ మున్సిపల్ అధ్యక్షుడు ముత్యాల మహేందర్ అన్నారు. ఈ ఆసుపత్రి వైద్య విధాన పరిషత్ ఆధీనంలో ఉన్నప్పటికీ తగిన సౌకర్యాలు లేవన్నారు.


మొక్కలు నాటుతున్న ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి

మొక్కల పెంపకం సామాజిక బాధ్యత

కడ్తాల్, జూలై 28(ఆంధ్రజ్యోతి): మొక్కలు నాటి, వాటిని పెంచడం ప్రతీ వ్యక్తి సామాజిక బాధ్యత అని, చుట్టూ ఉండే వాతావరణం పచ్చగా ఉంటేనే జీవులన్నింటికీ మేలు చేకూరుతుందని కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి అన్నారు. ఉద్యమ స్ఫూర్తితో ప్రజలంతా మొక్కలు నాటి వాటిని పరిరక్షించాలని కోరారు. కడ్తాలలో సోమవారం వనమహోత్సవాన్ని నిర్వహించారు. కార్యక్రమానికి ఎమ్మెల్యే హాజరై స్థానిక నాయకులతో కలిసి మొక్కలు నాటారు. అనంతరం సమావేశంలో మాట్లాడుతూ.. మొక్కల పెంపకంపైనే మనిషి మనుగడ, పర్యావరణ పరిరక్షణ ఆధారపడి ఉందన్నారు. వర్షాలు కుస్తున్నందున ఇప్పుడే మొక్కలు నాటాలని సూచించారు. మండల కేంద్రంలో కార్యాలయాలకు భవనాలు నిర్మిస్తామని, ఆసుపత్రి ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో ఏఎంసీ చైర్‌పర్సన్ యాట గీతనర్సింహ, వైస్‌చైర్మన్ గూడూరు భాస్కర్‌రెడ్డి, ఎంపీడీవో సుజాత, ఎంపీవో లాలయ్య, జెడ్పీ మాజీ వైస్‌చైర్మన్ బాలాజీసింగ్, పీసీసీ సభ్యుడు ఆయిళ్ల శ్రీనివాస్‌గౌడ్, డీసీసీ అధికార ప్రతినిధి జి.శ్రీనివాస్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి బిక్యానాయక్, పంచాయతీ కార్యదర్శి అల్లాజీ, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు నర్సింహ, నాయకులు బిచ్యానాయక్, చేగూరి వెంకటేశ్, జహంగీర్ అలీ, జి.మహేశ్, లక్పతినాయక్, జహంగీర్ బాబ, బోసు రవి, రాజేందర్‌గౌడ్, రాజేశ్, రామచందర్, మల్లేశ్‌గౌడ్, సత్యం, బిక్షపతి, లక్ష్మయ్య, మంకి శ్రీను, శ్రీకాంత్ పాల్గొన్నారు.

ప్రభుత్వ తోడ్పాటుతో పేదల్లో ఆత్మవిశ్వాసం

ఆమనగల్లు: కాంగ్రెస్ ప్రభుత్వ తోడ్పాటు, సంక్షేమ, అభివృద్ధి పథకాలతో పేదల్లో ఆత్మవిశ్వాసం పెరిగిందని ఎమ్మెల్యే నారాయణరెడ్డి అన్నారు. ఆమనగల్లు, కడ్తాల మండల కేంద్రాల్లో సోమవారం రేషన్‌కార్డుల పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించారు. కడ్తాల్, ఆమనగల్లు తహసీల్దార్లు ముంతాజ్, లలిత, మున్సిపల్ కమిషనర్ శంకర్‌నాయక్, డీటీ వినోద్, నాయకులతో కలిసి ప్రొసీడింగ్ కాపీలను పంపిణీ చేశారు. ఆయా సమావేశాల్లో ఎమ్మెల్యే మాట్లాడుతూ.. తెలంగాణ పథకాలు దేశానికి రోల్ మోడల్ అన్నారు. బీఆర్ఎస్ పాలనలో ఒక్క రేషన్‌కార్డు కూడా ఇవ్వలేదని విమర్శించారు. రేషన్ కార్డు కోసం ఎప్పుడైనా అప్లైం చేసుకోవచ్చని తెలిపారు. పథకాలను పేదలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఆర్ఐలు రాజురెడ్డి, వహీద్, నాయకులు గుర్రం కేశవులు, ధనుంజయ్య, వెంకటరమణారెడ్డి, నారాయణ, జగన్, మానయ్య, శ్రీశైలం, పాలకుర్ల రాములు, నరేందర్, యాదగిరిరెడ్డి, కాలె మల్లయ్య, జవహర్‌లాల్, నరేశ్‌నాయక్, ఖాదర్‌ఖాద్రి, ఫరీద్, రామకృష్ణ, శంకర్, తులసీరామ్, షాబుద్దీన్, ఇమ్రాన్‌బాబ, బాల్‌రాజ్, విజయ్‌రాథోడ్ పాల్గొన్నారు.



మెడల్ అందుకున్న మార్షల్ ఆర్ట్స్ విద్యార్థి నిదా రియాజ్ తాలూ

మార్షల్ ఆర్ట్స్‌లో విద్యార్థుల ప్రతిభ

కొత్తూర్, జూలై 28(ఆంధ్రజ్యోతి): సంగారెడ్డిలో రెండు రోజుల పాటు నిర్వహించిన సబ్ జూనియర్, సీనియర్ ఖేలో ఇండియా సిటి ఉషూ ఉమెన్స్ లీగ్-2025లో కొత్తూర్ ఈగల్ మార్షల్ ఆర్ట్స్ అకాడమీ విద్యార్థులు ప్రతిభ చూపారు. నిదా రియాజ్ తాలూ సిచెంక్వాన్ సబ్ జూనియర్ పోటీల్లో కాంస్య పతకం సాధించారని మాస్టర్ హాజీ సోమవారం తెలిపారు. మరో విద్యార్థి ప్రతిష్ట పోటీల్లో పాల్గొన్నారని చెప్పారు. ఉషూ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు ప్రేమ్‌రాజ్, ప్రధాన కార్యదర్శి అబ్దుల్ ఒమర్, సతీష్, పోచయ్య, రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు మహ్మద్ జావీద్ ఖాన్‌లు పతకాలు అందజేశారని ఆయన పేర్కొన్నారు.

పాల బిల్లులు సకాలంలో చెల్లించాలి


గుత్తా అమిత్‌రెడ్డితో హరిమోహన్‌రెడ్డి

ఆమనగల్లు, జూలై 28(ఆంధ్రజ్యోతి):తలకొండపల్లి మండలం రాంపూర్ గ్రామానికి చెందిన విజయ పాల సేకరణ కేంద్రం చైర్మన్ హరిమోహన్ రెడ్డి సోమవారం రాష్ట్ర పాడి పరిశ్రమాభివృద్ధి సహకార సమాఖ్య చైర్మన్ గుత్తా అమిత్‌రెడ్డిని మర్యాద పూర్వకంగా కలిశారు.హైదరాబాద్‌లో ని ఆయన కార్యాలయంలో కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. ఈ సందర్భంగా విజయ పాల రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని కోరారు. పాలబిల్లులు సకాలంలో చెల్లించాలని చైర్మన్‌ను కోరగా సానుకూలంగా స్పందించినట్లు హరిమోహన్ రెడ్డి తెలిపారు.



ర్యాలీలో జీనియస్ గ్రామర్ స్కూల్ విద్యార్థులు

పొగాకు ఆరోగ్యానికి హానికరం

మూడుచింతలపల్లి, జూలై 28 (ఆంధ్రజ్యోతి): 'పొగాకు ఆరోగ్యానికి హానికరం, పొగాకు తాగకండి.. క్యాన్సర్ బారిన పడకండి.' అంటూ విద్యార్థులు ర్యాలీ నిర్వహించారు. జగ్గంగూడలో సోమవారం జీనియస్ గ్రామర్ హైస్కూల్ విద్యార్థులు పొగాకు వాడకంతో కలిగే దుష్ప్రభావాలపై అవగాహన కల్పించారు. సరదా కోసం కాల్చే పొగాకు వ్యసనంగా మారి ప్రాణాలను హరిస్తుందన్నారు. పొగతాగే వారేగాక పొగ పీల్చిన వారికీ ఊపిరితిత్తులు దెబ్బతింటాయన్నారు. కార్యక్రమంలో కరస్పాండెంట్ కృష్ణారెడ్డి, ప్రిన్సిపాల్ కల్పనరెడ్డి, టీచర్లు, విద్యార్థులు పాల్గొన్నారు.

స్థానిక సమస్యలను పరిష్కరించాలి


కమిషనర్‌కు వినతిపత్రం ఇస్తున్న సాయినాథ్‌గౌడ్

కీసర రూరల్, జూలై 28 (ఆంధ్రజ్యోతి): దమ్మాయిగూడ మున్సిపల్ పరిధిలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని సోమవారం మాజీ వార్డు సభ్యుడు దర్గం సాయినాథ్‌గౌడ్ మున్సిపల్ కమిషనర్‌కు వినతిపత్రం ఇచ్చారు. మున్సిపాలిటీలో వీధికుక్కల బెడద ఎక్కువైందన్నారు. అదే విధంగా వీధి దీపాలను ఏర్పాటు చేయాలని కోరారు. ప్రధాన రహదారిలో ఏర్పడిన గుంతలను పూడ్చివేయాలని విజ్ఞప్తి చేశారు. స్పందించిన కమిషనర్ వెంటనే చర్యలు తీసుకుంటామని ఆయనకు హామీ ఇచ్చారు.

ఒక్క క్లిక్‌తో..

(ఐదో పేజీ తరువాయి)

పాఠ్యాంశాలను విని ఆయా సబ్జెక్టుల్లో పూర్తిస్థాయిలో పట్టు సాధించవచ్చు. స్మార్ట్ చరవాణిలో ఈ యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకుని అర్థం కాని పాఠ్యాంశాన్ని చదివే వెసులుబాటు కల్పించారు. ఏమైనా సందేహాలున్నా యాప్ ద్వారా వీటిని నివృత్తి చేసుకోవచ్చు. విద్యార్థులు పాఠశాలలకు వెళ్లలేనప్పుడు ఇంటి దగ్గర నుంచే ఈ పాఠాలన్నీ వినవచ్చు. తరగతి గదిలో తమ టీచర్ చెప్పిన పాఠం సరిగా అర్థం కాకున్నా ఇంటికి వెళ్లి దీక్ష యాప్ ద్వారా ఆ పాఠ్యాంశాన్ని ఒకటికి రెండుసార్లు విని పూర్తిగా తెలుసుకోవచ్చు. ఈ యాప్ విద్యార్థులతో పాటు ఉపాధ్యాయులకు ఉభయతారకంగా పనిచేసే విధంగా రూపొందించారు. ఇందులోని పాఠ్యాంశాలన్నీ సుశిక్షితులైన ఉపాధ్యాయులు సృజనాత్మకంగా బోధించారు. దీంతో ఇతర ఉపాధ్యాయులు కూడా వీటిని తిలకించి మేలైన పద్ధతుల్లో బోధన చేయడానికి ఉపయోగకరంగా ఉంటుంది. దీనిపై విద్యాశాఖ అధికారులు విద్యార్థులకు ఎప్పటికపుడు అవగాహన కల్పిస్తున్నారు. దీన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకుని చదువుల్లో మరింత రాణించవచ్చు.

DIKSHA

ఎలా వినాలి..?

స్మార్ట్ ఫోన్‌లోని ప్లేస్టోర్ లేదా ఐఓఎస్‌లోకి వెళ్లి 'దీక్ష ఫర్ స్కూల్ ఎడ్యుకేషన్' యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకోవాలి. యాప్‌లోకి వెళ్లి లాంగ్వేజ్‌తో పాటు ఇతర అడిగిన వివరాలన్నీ నమోదు చేయాలి. ఆ తర్వాత లాగిన్ అవ్వాలి. ఈ యాప్‌ను ఉపయోగించి డిజిటల్ టెక్స్ట్‌బుక్స్‌పై స్కాన్ చేస్తే డిజిటల్ పాఠం వస్తుంది. పాఠ్యపుస్తకం ప్రధాన పుటపై ఉన్న క్యూఆర్ కోడ్ స్కాన్ చేస్తే స్మార్ట్ ఫోన్‌లో కోరుకున్న పాఠ్యాంశాన్ని పొందవచ్చు నిపుణులైన ఉపాధ్యాయులు బోధించిన పాఠాలను ఎన్నిసార్లైనా వినవచ్చు.


సీత్లా వేడుకల్లో మహిళలు

భక్తిశ్రద్ధలతో సీత్లా వేడుకలు

కడ్తాల్, జూలై 28(ఆంధ్రజ్యోతి): సీత్లా సంబురాలు అంబరాన్నంటాయి. గిరిజనుల సంస్కృతీ సంప్రదాయాన్ని చాటాయి. నార్లకుంట తండాలో సోమవారం సీత్ల వేడుకలు జరుపుకున్నారు. మహిళలు సీత్లమాత ఆలయానికి చేరుకొని నైవేద్యం సమర్పించారు. తమను సల్లగా చూడాలని, వర్షాలు సమృద్ధిగా కురిపించాలని అమ్మవారిని వేడుకున్నారు. వేడుకలో యువతీయువకుల నృత్యాలు ఆకట్టుకున్నాయి. బంజారాల పండుగలు సీత్ల వేడుకతో ప్రారంభమవుతాయని నాయకుడు దశరథ్‌నాయక్ పేర్కొన్నారు. సంస్కృతి, సంప్రదాయాలను పరిరక్షించుకోవాలన్నారు.

యూరియా ఏదయా?

జిల్లాలో నత్రజని కొరత

- అదునుకు అందని ఎరువులు
- ఇబ్బందులు పడుతున్న రైతులు


పరిగిలోని ఆగ్రోస్ సెంటర్ వద్ద రైతుల నిరసన ఇలా

పరిగి, జూలై 28(ఆంధ్రజ్యోతి): జిల్లాలో యూరియా కొరతతో రైతులు ఇబ్బంది పడుతున్నారు. వర్షాలు కురుస్తున్నందున రైతులు యూరియా కోసం దుకాణాల వద్దకు వెళ్తున్నారు. యూరియా సరఫరా తగ్గడంతో కొరత ఏర్పడింది. అరకొర వస్తున్నా సరిపోవడం లేదు. డీఏపీకి సైతం వారం, పది రోజులుగా షాపులకు తిరుగుతున్నారు. వర్షాలు పడినప్పుడే ఎరువులు వేయాలని, లేకుంటే అవి కరకగ వేసినా ప్రయోజనం లేదని రైతులు అంటున్నారు. ఎరువులకు అదును దాటుతోందని ఆవేదన చెందుతన్నారు. ఎరువులు, విత్తనాల కొరత లేకుండా చర్యలు తీసుకుంటామని ప్రభుత్వం చెబుతున్నా ఆ పరిస్థితి లేదు. జిల్లాలో ఎక్కడా చూసినా ఎరువులు దుకాణాల వద్ద రైతుల బారులు కన్పిస్తున్నాయి. గంటల తరబడి లైన్లలో ఉంటున్నా చివరికి ఎరువులు అందడం లేదు. ఎరువు లేక బోర్ల కింద వరినాట్లను వాయిదా వేస్తున్నారు. పొరుగున ఉన్న మహబూబ్‌నగర్, సంగారెడ్డి, రంగారెడ్డి జిల్లాలకు ఎరువుల కోసం వెళుతున్నారు. జిల్లాలో వివిధ పంటలు 5.63లక్షల ఎకరాల్లో సాగుచేయాల్సి ఉండగా, ఇప్పటికే 70శాతం పంటలు వేశారు. పత్తి, కంది, పెసర వంటి మొట్ట పంటలను సాగుచేశారు. నీటి సదుపాయం ఉన్న వారు వరినాట్లు వేస్తున్నారు. ఇంకొందరు రైతులు వరినారు పోస్తున్నారు.

వర్షాల రాకతో ఎరువులకు డిమాండ్

నెల రోజుల పాటు ముఖం చాటేసిన వర్షాలు వారం, పది రోజులుగా కురుస్తుండడంతో పత్తి, కంది, మొక్కజొన్న తదితర పంటలకు యూరియా అవసరం. దీంతో 80శాతం మంది రైతులు ఎరువుల కోసం ఫర్టిలైజర్స్‌కు వెళ్తున్నారు. దీంతో రైతులకు సరిపడా నిల్వలు లేవు. జిల్లాలో ఈ సీజన్‌కు 35,344 టన్నుల యూరియా అవసరం ఉంది. ప్రస్తుతం 6,298 టన్నుల యూరియా మాత్రమే ఉంది. కనీసం 20వేల టన్నులైనా అవసరమని అధికారులు చెబుతున్నారు. కొందరు వ్యాపారులు కొరత సృష్టించి ఎక్కువ రేట్లకు అమ్ముతున్నారని రైతులు ఆరోపిస్తున్నారు. లోడ్లు వచ్చిన వెంటనే అధికారులు ఉండి పంపిణీ చేయించాలంటున్నారు. దీంతో బ్లాక్ మార్కెటింగ్‌కు అడ్డుకట్ట వేయొచ్చని చెబుతున్నారు.

ఒక్కో ఆధార్ కార్డుకు ఒక్కో బస్తా...

విక్రయ కేంద్రాల్లో ప్రతీ రైతు ఆధార్‌కార్డుకు రెండు బస్తాలు ఇస్తుండగా, పరిగిలో మాత్రం ఒక్క యూరియా బస్తానే ఇస్తున్నారు. సోమవారం పరిగిలోని ఆగ్రోస్ సెంటర్లో రైతులు లైన్లలో నిలబడి యూరియా తీసుకున్నారు. ఒక్క బస్తాతో ఎలా సరిపెట్టాలని వాపోతున్నారు. అదికూడా ధర పెంచి అమ్ముతున్నారు. యూరియా బస్తా ఎమ్మార్పీ రూ.265 ఉంది. వ్యాపారులు మాత్రం రూ.300 నుంచి రూ.320 తీసుకుంటున్నారు.

ఒక్క బస్తా అన్నా లేదు



నేను పత్తి, వరి, మొక్కజొన్న వేశాను. వర్షాలు పడ్డాయి. పంటలకు యూరియా వేయాలి. పరిగిలో ఏ షాపులో అడిగినా యూరియా లేదంటున్నారు. ఆగ్రోస్ కేంద్రంలో ఒక్క బస్తానే ఇస్తున్నారు. ఇది కూడా నాకు దొరకలే. ప్రభుత్వం వెంటనే యూరియా సరఫరా చేయాలి. లేదంటే పంటల దిగుబడి తగ్గిపోతుంది.

- తిరుపతి, రైతు, బాబాపూర్

ఎంతకు కొందామన్నా దొరకడం లేదు



పరిగిలో ఎక్కడా యూరియా లేదు. ఎంత దరకైనా కొందామన్నా దొరకడం లేదు. అదే సిఫారసు ఉన్న వారికి మాత్రం వేరే గోదాం నుంచి సరఫరా చేస్తున్నారు. భూమిలో పదన ఉన్నపుడే యూరియా వేయాలి. ఒకటిరెండు రోజుల్లో యూరియా వేయకుంటే మల్ల వాన పడేదాకా ఆగాల్సిందే.

- లక్ష్మయ్య, రైతు, నస్కల్

యూరియా కొరత లేదు.. ఆందోళనొద్దు

జిల్లాలో యూరియా కొరత లేదు. అయితే అందరూ ఒకేసారి దుకాణాలకు రావడం వల్లే అందరికీ లభించడం లేదు. ప్రస్తుతం 6వేల టన్నుల యూరియా ఉంది. రైతులు ఆందోళన చెందొద్దు. షాపుల వద్ద ఎరువుల పంపిణీపై ఏవో, ఏఈవోలు పర్యవేక్షిస్తారు. యూరియాను బ్లాక్ చేస్తే వ్యాపారులపై చర్యలు తప్పవు.

- రాజారత్నం, జిల్లా వ్యవసాయాధికారి

నాయకత్వ లక్షణాలను అలవర్చుకోవాలి

కొడంగల్, జూలై 28 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు నాయకత్వ లక్షణాలు అలవర్చుకోవాలని నవీన ఆదర్శ ఉన్నత పాఠశాల వ్యవస్థాపకుడు వెంకటయ్య, ప్రిన్సిపాల్ నరేశ్ రాజ్ అన్నారు. పాఠశాలలో సోమవారం ఎన్నికలు, ఓటు వేసే విధానంపై ఉపాధ్యాయులు విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ సంతోష, ఉపాధ్యాయులు వేదావతి, శకుంతల, నాగేంద్రమ్మ, సునీత, మెహెరాజ్ పాల్గొన్నారు.


ఇందిరమ్మ ఇంటి ప్రొసీడింగ్స్‌ను అందజేస్తున్న భీమ్‌రెడ్డి

సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కు పంపిణీ

బొంరాస్‌పేట్, జూలై 28 (ఆంధ్రజ్యోతి): మండలంలోని తుంకిమెట్ల గ్రామంలో కావలి పద్మకు ప్రభుత్వం ద్వారా మంజూరైన సీఎంఆర్ఎఫ్ రూ.40వేల చెక్కును సోమవారం కాంగ్రెస్ నాయకులు అందజేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు మల్లికార్జున్, దేశ్యానాయక్, మోహన్‌రెడ్డి, వెంకటయ్య, వెంకట్రాములు, మొహ్మద్ రఫీ పాల్గొన్నారు.

పరిగి: సీఎంఆర్ఎఫ్ పేదలకు వరంలాంటిదని డీసీసీ ఉపాధ్యక్షుడు జి.వెంకట్‌రాంలు అన్నారు. మండలంలోని గడిసింగాపూర్‌లో మాసాని వెంకటయ్యకు సోమవారం రూ.లక్షా 80వేలు విలువ గల సీఎంఆర్ఎఫ్ చెక్కును అందజేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు బి.మాణిక్యం, బి.శ్రీనివాస్, పంచాయితీ కార్యదర్శి మొగులయ్య, రాఘవేందర్‌రావు తదితరులు పాల్గొన్నారు.


శిక్షణ పొందుతున్న కార్యదర్శులు, బీపీఎంలు, అధికారులు

ఫేషియల్ రికగ్నిషన్‌తో పింఛన్

- నేటి నుంచి అమలు
- తీరనున్న వేలిముద్ర కష్టాలు
- పోస్ట్‌మెన్, కార్యదర్శులకు శిక్షణ పూర్తి

తాండూరు, జూలై 28(ఆంధ్రజ్యోతి):ఆసరా పింఛన్‌దారులకు రాష్ట్ర ప్రభుత్వం కొత్త విధానాన్ని అమలులోకి తేనుంది. ఈ నెల 29 నుంచి నూతన పద్ధతిలో పెన్షన్ ఇవ్వనున్నారు. ఇప్పటి వరకు పింఛన్‌దారులు పడిన వేలిముద్ర కష్టాలు దూరం కానున్నాయి. కొత్తగా ఫేషియల్ రికగ్నిషన్(ముఖ గుర్తింపు) విధానాన్ని ప్రభుత్వం తేనుంది. వృద్ధులు, వికలాంగులు, వితంతువులు, ఒంటరి మహిళలు, డయాలసిస్, చేనేత, గీత కార్మికులు వంటి ఏడు రకాల పింఛన్లను పేదలకు ప్రభుత్వం నెలనెలా పంపిణీ చేస్తోంది. అయితే చాలా మంది వృద్ధులు, వికలాంగులు పింఛన్ తీసుకునే సమయంలో వేలిముద్ర సరిపోక పెన్షన్‌లు తీసుకోలేని పరిస్థితులు ఉంటున్నాయి. ఈ విషయాన్ని ప్రభుత్వం గుర్తించి నూతన విధానాన్ని అమలు చేస్తుంది. డిజిటల్ విధానంలో ముఖ గుర్తింపుతో పింఛన్ ఇస్తారు. ఇందుకు అధికారులకు, సిబ్బందికి శిక్షణ ఇచ్చారు. తాండూరు డివిజన్‌లోని ఏడు మండలాలకు చెందిన పోస్ట్‌మెన్(బీపీఎంలు), పంచాయతీ కార్యదర్శులకు డీఆర్డీపీ(పింఛన్ విభాగం) శిక్షణ ఇచ్చింది.

ఎన్నికల్లో మంచి వ్యక్తులనే ఎన్నుకోవాలి


మాట్లాడుతున్న ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

షాద్‌నగర్, జూలై 28(ఆంధ్రజ్యోతి): రాజకీయ విలువలను కాపాడేందుకు ఎన్నికల్లో సచ్ఛీలురనే ప్రజాప్రతినిధులుగా ఎన్నుకోవాలని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ ప్రజలకు సూచించారు. దిగజారుడు మాటలు, వాగ్దానాలతో రాజకీయాలు భ్రష్టుపడుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. సోమవారం క్యాంప్ కార్యాలయంలో మీడియా సమావేశంలో మాట్లాడారు. కొందరు ప్రజాప్రతినిధులు తమ పార్టీ అధినేతల దృష్టిలో పడేందుకు ముఖ్యమంత్రిపై, వారి కుటుంబ సభ్యులపై ఆరోపణలు చేయడం సమంజసం కాదన్నారు. దిగజారుడు విమర్శలను ప్రజలు అసహ్యించుకుంటున్నారని అన్నారు. విలువలు గల వ్యక్తులనే ఓటర్లు చట్టసభలకు పంపాలని కోరారు. రాజకీయ విమర్శలు చేసే హక్కు అందరికీ ఉంటుందని, ఆ విమర్శలు కూడా ప్రజాస్వామ్య పద్ధతిలో ఉండాలన్నారు. సీఎం రేవంత్‌రెడ్డిపై అనుచిత వ్యాఖ్యలు చేసిన బీఆర్ఎస్ ఎమ్మెల్యే కౌశిక్‌రెడ్డిపై చట్టప్రకారం చర్యలు తీసుకోక తప్పదని హెచ్చరించారు. దివంగత సీఎం వైఎస్.రాజశేఖర్‌రెడ్డి సుపరిపాలన అందించి ప్రజల గుండెల్లో నిలిచారన్నారు. అదే స్థాయిలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పాలన సాగిస్తున్నారని, అగ్రవర్ణానికి చెందిన సీఎం బీసీలకు 42శాతం రాజకీయ రిజర్వేషన్లు కల్పించారన్నారు. సమావేశంలో నాయకులు సులోచనకృష్ణారెడ్డి, రఘు, అగ్గనూరు బస్వం, బాలరాజు గౌడ్, తిరుపతిరెడ్డి, పురుషోత్తంరెడ్డి పాల్గొన్నారు.

కార్మికులకు నాణ్యమైన వస్తువులు అందజేయాలి

మాజీ కౌన్సిలర్ సంగీతఠాకూర్

కథనాలపై ఆంధ్రజ్యోతికి అభినందన


సేకరించిన వివరాలను చూపుతున్న సంగీత

తాండూరు, జూలై 28(ఆంధ్రజ్యోతి): తాండూరు మున్సిపాలిటీలో పారిశుధ్య కార్మికుల మెటీరియల్ కొనుగోలుకు రూ.50లక్షలు వెచ్చించి నాసిరక వస్తువులు కొనుగోలు చేయాలని చూశారని మాజీ కౌన్సిలర్ సంగీతఠాకూర్ అన్నారు. ఈ అవినీతిని వెలికి తీసి బల్దియాకు న్యాయం జరిగేలా కార్మికుల పక్షాన వార్తలు రాసిన ఆంధ్రజ్యోతికి ఆమె సోమవారం అభినందనలు తెలిపారు. గతంలో ఇదే అంశంపై తాను కార్యాలయంలో ఆర్టీఐ కింద వివరాలడిగితే పూర్తిగా ఇవ్వలేదన్నారు. కార్యాలయంలో జరుగుతున్న అక్రమాలపై తాను కూడా మున్సిపల్ శాఖ రాష్ట్ర అధికారులకు ఫిర్యాదు చేశానని తెలిపారు. ప్రజల సొమ్ము దుబారా కాకుండా మొదట రూ.50లక్షలుగా నిర్ణయించి ఇప్పుడు రూ.18లక్షలకే మెటీరియల్ కొనుగోళ్లకు ఉన్నతాధికారులు నిర్ణయించడం హర్షణీయం అన్నారు. తెచ్చే కన్జర్వేషన్ మెటీరియల్ కూడా నాణ్యతగా ఉండాలని డిమాండ్ చేశారు. నిధులు దుర్వినియోగం కాకుండా మున్సిపల్ ప్రత్యేకాధికారి, కలెక్టర్, ఎమ్మెల్యే ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని ఈ సందర్భంగా సంగీత కోరారు.

ఎన్‌హెచ్‌ఆర్‌సీ బహిరంగ విచారణ

- ఒక్కరోజులో రెండు డివిజన్ బెంచీలపై 100కుపైగా కేసుల స్వీకరణ
- 88 వరకు విచారణ


మానవ హక్కుల కమిషన్ వద్దకు హాజరైన శ్రీలత

హైదరాబాద్ సిటీ, జూలై28(ఆంధ్రజ్యోతి): "చేతికొచ్చిన కుమారుడు అనుమానాస్పద మృతి చెందితే, పోలీసులు రోడ్డుప్రమాదంగా కేసు నమోదు చేశారంటూ తల్లి ఫిర్యాదు. ఆస్తి తగాదాలో చెల్లెళ్లే అన్నను పొ ట్టన పెట్టుకున్నారంటూ మృతుడి భార్య ఆవేదన. ఉద్యోగం నుంచి తొలగించారని ఓ యువకుడి రోదన.. ఇలా భూకబ్జాలు, ఆస్తి తగాదాలు, లైంగిక దాడులు తదితర మానవ హక్కుల హననానికి సంబంధించిన వందకుపైగా కేసులను జాతీయ మానవ హక్కుల కమిషన్(ఎన్‌హెచ్‌ఆర్‌సీ) జూబ్లీహిల్స్‌లోని మర్రి చెన్నారెడ్డి మానవ వనరుల కేంద్రంలో సోమవారం బహిరంగ విచారణ నిర్వహించింది. డివిజన్ బెంచ్-1 లో ఎన్‌హెచ్‌ఆర్‌సీ చైర్మన్ జస్టిస్ రామ సుబ్రహ్మణ్యన్ నేతృత్వంలోని డివిజన్ బెంచ్-1లో 36 కేసులు విచారించారు. తెలంగాణ హోం శాఖ ప్రిన్సిపల్ సెక్రెటరి రవి గుప్తా, లాఅండ్ ఆర్డర్ అడిషనల్ డీజీపీ మహేష్ భగవత్, పలువురు ఐపీఎస్‌లు, ఐఏఎస్‌లు, జిల్లా పోలీసు అధికారులు పలు కేసుల నేపథ్యంలో విచారణకు హాజరయ్యారు.

ఈ సందర్భంగా మేడ్చల్ జిల్లాకు చెందిన ఓ బాధితురాలు తన సమస్యపై అధికారులు దృష్టికి తీసుకెళ్లారు. "నా భర్త పేరు నారంగారి బాలరాజు. మాది మేడ్చల్ జిల్లా యాడారం. పాల వ్యాపారం చేస్తూ కుటుంబాన్ని పోషించే నా భర్త 2023 సెప్టెంబరులో అనుమానాస్పదంగా మృతిచెందాడు. అప్పుడు నేను కాన్పు కోసం పుట్టింటికి వచ్చాను. నాకిప్పుడు ముగ్గురు పిల్లలు. మా ఒక ఎకరా ముప్పై గుంటల భూమిని నా ముగ్గురు ఆడ పడుచులు అక్రమంగా రాయించుకున్నారు. అప్పటి నుంచి అన్నా చెల్లెళ్లకు గొడవలయ్యా యి. నా భర్తను వాళ్లు కిరాయి గుండాలను పెట్టి చంపించారు. హత్యపై మేడ్చల్ పీఎస్‌లో ఫిర్యాదు చేశాను. వారు చార్జిషీట్ వేయలేదు. పోలియో వల్ల నడవలేని పరిస్థితి నాది. నా భర్తను చంపి నవాళ్లకు తగిన శిక్ష పడాలి. నాకు, నా పిల్లలకు న్యాయం కావాలని ఇక్కడికి వచ్చాం. నా బాధ అంతా విన్న ఎన్‌హెచ్‌ఆర్‌సీ.. కేసును ప్రత్యేకంగా విచారించేలా చర్యలు తీసుకుంటామని హామి ఇచ్చింది." అని నారంగారి శ్రీలత వివరించారు.


మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ లింగ్యానాయక్

దరఖాస్తుల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలి

బొంరాస్‌పేట్, జూలై28(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం ప్రవేశపెట్టిన భూ భారతి రెవెన్యూ సదస్సుల్లో అధికారులు స్వీకరించిన దరఖాస్తుల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని అదనపు కలెక్టర్ లింగ్యానాయక్ సూచించారు. సోమవారం బొంరాస్‌పేట్ తహసీల్దార్ కార్యాలయాన్ని ఆయన తనిఖీ చేశారు. తహసీల్దార్ పద్మావతి, రెవెన్యూ సిబ్బందితో మాట్లాడుతూ సదస్సుల్లో స్వీకరించిన దరఖాస్తుల పరిష్కార సమయంలో క్షుణ్ణంగా పరిశీలించాలన్నారు. ప్రతీ దరఖాస్తుపై సమగ్ర విచారణతో సంబంధిత వ్యక్తులకు నోటీసులు జారీ చేయాలన్నారు. అవసరమైన డాక్యుమెంట్‌లు, రికార్డులను పరిశీలించి ఒకే డాక్యుమెంట్‌గా పోర్టల్‌లో అప్‌లోడ్ చేయాలన్నారు.

రోడ్లకు మరమ్మతులు


ఎల్లంపేటలో గుంతను పూడుస్తున్న మున్సిపల్ సిబ్బంది

మేడ్చల్ టౌన్, జూలై 28 (ఆంధ్రజ్యోతి): వర్షాల కారణంగా మున్సిపల్ పరిధిలో గుంతల మయంగా మారిన రోడ్లను మరమ్మతు చేసే పనులను ప్రారంభించామని ఎల్లంపేట మున్సిపల్ కమిషనర్ నిత్యానందం తెలిపారు. వారం రోజులుగా కురుస్తున్న వర్షాల కారణంగా మున్సిపల్ పరిధిలోని పలు ప్రాంతాల్లో రోడ్లు గుంతల మయంగా మారి ప్రజలు ఇబ్బందులు పడుతుండటతో రోడ్ల మరమ్మతులు చేపట్టామన్నారు. మున్సిపల్ పరిధిలోని రేకుల బావి సోమారం, ఎల్లంపేట ప్రధాన రోడ్డుపై ప్యాచ్‌వర్క్ చేపట్టామన్నారు. మున్సిపల్ పరిధిలో వర్షం కారణంగా గుంతల మయంగా మారిన అన్నిరోడ్లను దఫాలుగా మరమ్మతులు చేస్తున్నామన్నారు. ఏమైనా సమస్యలుంటే తన దృష్టికి తేవాలని కమిషనర్ తెలిపారు.

ఆలయాల్లో ఆధ్యాత్మిక శోభ


ధారూరు: శివాలయంలో భక్తుల పూజలు

వికారాబాద్, జూలై 28 (ఆంధ్రజ్యోతి): శ్రావణమాసం తొలి సోమవారం సందర్భంగా ఆలయాల్లో ఆధ్యాత్మిక శోభ సంతరించుకుంది. వికారాబాద్‌లోని భక్తులు బుగ్గ రామలింగేశ్వర స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయంలో స్వామి వారికి రుద్రాభిషేకం, అర్చన, అభిషేకాలు నిర్వహించి భక్తిశ్రద్ధలతో స్వామి వారిని దర్శించుకున్నారు. అనంతరం వీరసేవ సమాజం వికారాబాద్ తరుపున అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ ధర్మకర్తలు ఆత్మలింగం, చెక్క వీరన్న, గంగాధర్, వీరేశం, దయానందస్వామి, బిచ్చప్ప ప్రసాద్‌తో పాటు ఆలయ అర్చకులు శ్రీకాంత్ స్వామి, శివశంకర్ స్వామి, అప్పవిజయ్ కుమార్ పాల్గొన్నారు.

కొడంగల్: పట్టణంలోని మహాదేవ, గాడిబావి శివాలయాలు, బసవలింగేశ్వరస్వామి ఆలయాల్లో శ్రావణమాసం తొలి సోమవారం సందర్భంగా భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయాలకు భక్తులు పెద్ద ఎత్తున తరలి వచ్చి స్వామివారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పురోహితులు విజయ్‌కుమార్, శివతేజ, వీరేశ్ తదితరులు పాల్గొన్నారు. అదేవిధంగా నాగులచవితి సందర్భంగా సోమవారం స్థానిక శ్రీ వేంకటేశ్వర స్వామి ఆలయంలో నాగదేవతకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. పురోహితులు రామస్వామి మాట్లాడుతూ.. నాగ దేవతకు పాలు, పెరుగు, నెయ్యి, చందనం లాంటి సుగంధ ద్రవ్యాలతో అభిషేకం నిర్వహించినట్లు తెలిపారు.

మోమిన్‌పేట్: శ్రావణమాసం సోమవారం సందర్భంగా మండలంలోని నందివాగు ప్రాజెక్టు పరివాహక ప్రాంతంలో వెలిసిన శ్రీ రామలింగేశ్వరస్వామికి సోమవారం భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు భక్తులు బారులు తీరారు. స్వామివారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు, అభిషేకం చేశారు.

కులకచర్ల: మండలంలోని బండవెల్కిచర్ల పాంబండ శ్రీ రామలింగేశ్వరస్వామి దేవాలయానికి భక్తుల సందడి నెలకొంది. శ్రావణమాసం తొలి సోమవారం సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజలు, అభిషేకం నిర్వహించారు. భక్తులు స్వామివారి దర్శనం కోసం ఉదయం నుంచి క్యూలో నిలిచారు. గుండంలో స్నానం చేసి స్వామి వారిని దర్శించుకున్నారు. పూజారి పాండు శర్మ భక్తులకు స్వామివారి దర్శనం కల్పించారు.

ధారూరు: ధారూరులోని శ్రీ వీరభద్రేశ్వర ఆలయంలో శ్రావణమాసం తొలి సోమవారం సందర్భంగా ప్రత్యేక పూజలు చేశారు. శివలింగాన్ని జలం, పంచామృతంతో అభిషేకించి, పసుపు, కుంకుమతో అలంకరించారు. నైవేద్యం సమర్పించి హారతినిచ్చారు. గణపతి, సుబ్రమణేశ్వర, వీరభద్రేశ్వర స్వామి, అమ్మవారు, నంది విగ్రహాలకు పూజలు చేశారు. పూజారీ చెన్నబసవయ్యస్వామి పూజలు చేసి తీర్థ ప్రసాదాలు వితరణ చేశారు.


వికారాబాద్: రుద్రాభిషేకం నిర్వహిస్తున్న అర్చకులు, భక్తులు

కమీషన్ల కక్కుర్తి!

● ఆగిపోతున్న చెత్తబండ్లు ● మరమ్మతుల్లోనూ చేతివాటం


రామయ్యగూడ రోడ్డులో చెత్త వాహనం నిలిచి ఇబ్బందులు పడుతున్న కార్మికులు

వికారాబాద్, జూలై 28 (ఆంధ్రజ్యోతి): మున్సిపాలిటీలో చెత్త వాహనాలు ఎక్కడబడితే అక్కడ నిలిచిపోతుండడంతో కార్మికులు అవస్థలు పడుతున్నారు. వికారాబాద్‌లోని రామయ్యగూడ మీదుగా సోమవారం డంపింగ్ యార్డుకు వెళుతున్న ఓ చెత్త వాహనం అర్ధాంతరంగా నడిరోడ్డుపై ఆగిపోయింది. దీంతో కార్మికులు గంటల తరబడి ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ఈ విషయంలో ఉన్నతాధికారులకు తెలిపినా ప్రయోజనం లేదని వాపోతున్నారు. దీంతో చేసేది లేక కార్మికులే ఇతరుల సాయం తీసుకుని మరమ్మతులు చేసుకుంటున్నారు. అంతేగానీ మునిసిపల్ అధికారులు మాత్రం తమకేమీ పట్టనట్లుగా వ్యవహరిస్తున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. మున్సిపల్ చెత్త వాహనాల మరమ్మతుల్లో కమీషన్ల కుక్కర్తితో పాటు డీజిల్ పంపకాల్లోనూ పెద్ద మొత్తంలో అవినీతి జరుగుతున్నట్లు చర్చ సాగుతోంది.

పొగాకు వద్దు.. ఆరోగ్యం ముద్దు


మానవహారం నిర్వహిస్తున్న విద్యార్థులు

తాండూరు రూరల్, జూలై 28(ఆంధ్రజ్యోతి): ప్రపంచ పొగాకు వ్యతిరేక దినోత్సవాన్ని పురస్కరించుకుని సోమవారం తాండూరు మండలం ఐనెల్లి ఆదర్శ పాఠశాల, కళాశాల విద్యార్థులు పాఠశాల నుంచి జినుగుర్తి ఎక్స్ రోడ్డు వరకు ర్యాలీ నిర్వహించారు. 'పొగాకు వద్దు.. ఆరోగ్యం ముద్దు' అంటూ నినాదాలు చేశారు. అనంతరం జినుగుర్తి ఎక్స్‌రోడ్డులో విద్యార్థులు మానవ హారం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ శ్రీదేవి మాట్లాడుతూ పొగ ఆరోగ్యానికి హానికరమని తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, అధ్యాపకులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌లో చేరిన బీఎస్పీ నేత సత్యమూర్తి


ఎమ్మెల్యే సమక్షంలో కాంగ్రెస్‌లో చేరిన సత్యమూర్తి

తాండూరు, జూలై 28 (ఆంధ్రజ్యోతి): బీఎస్పీ రాష్ట్ర నాయకుడు సత్యమూర్తి సోమవారం ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. 23వ వార్డుకు చెందిన 100 మంది కార్యకర్తలతో కాంగ్రెస్‌లో చేరారు. రానున్న మున్సిపల్ ఎన్నికల్లో కలిసికట్టుగా పనిచేసి కాంగ్రెస్ జెండాను ఎగురవేయాలని ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి కోరారు. ఈ కార్యక్రమంలో పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు హబీబ్‌లాల, మహిళ కాంగ్రెస్ అధ్యక్షురాలు గాజుల మాధవి, నాయకులు అబ్దుల్ రవూఫ్, ప్రభాకర్‌గౌడ్, బాతుల వెంకట్, తదితరులు పాల్గొన్నారు.

ప్రజావాణిలో దరఖాస్తులు నిల్


మాట్లాడుతున్న ఎంపీడీవో డానియల్

కోట్‌పల్లి, జులై 28 (ఆంధ్రజ్యోతి): మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణిలో ఒక్క దరఖాస్తు కూడా రాలేదు. ఎంపీడీవో డానియల్ ఇతర అధికారులు వేచి చూసినప్పటికీ ప్రజల నుంచి స్పందన కనిపించలేదు. ఈ సందర్భంగా ఎంపీడీవో డానియల్ మాట్లాడుతూ మండల ప్రజలు ప్రజావాణిని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీవో సుధీర్‌డ్డి, ఆర్‌ఐ భాగ్యలక్ష్మి, పంచాయతీ కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.


హ్యాకథాన్‌లను సద్వినియోగం చేసుకోవాలి



హ్యాకథాన్‌లో విద్యార్థులు

ఘట్‌కేసర్ రూరల్, జూలై 28(ఆంధ్రజ్యోతి) : కళాశాలలో నిర్వహించే హ్యాకథాన్‌లను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని అనురాగ్ యూనివర్సిటీ ఐటీ విభాగం హెచ్‌వోడీ నితీషా శర్మ తెలిపారు. పోచారం మున్సిపాలిటీ, వెంకటాపూర్ అనురాగ్ యూనివర్శిటీలో 'విద్యలో ఏఐ వినియోగం'పై జరిగిన కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఏఐ వినియోగం పట్ల విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఎఐని సక్రమంగా వినియోగించుకోవాలని సూచించారు. అవకాశాలను విద్యార్థులు అందిపుచ్చుకొని ముందుకు సాగాలని కోరారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు అనంద్‌బాబు, సాయికృష్ణ, ఎన్ఎస్ఎస్ వలంటీర్లు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

యూరియాను తక్కువ మోతాదులో వాడాలి


యూరియా బస్తాలు తీసుకెళ్తున్న రైతులు

మోమిన్‌పేట్, జూలై 28 (ఆంధ్రజ్యోతి): రైతులు పంటలకు యూరియాను తక్కువ మోతాదులో వాడాలని పీఏసీఎస్ చైర్మన్ బండ విష్ణువర్ధన్‌రెడ్డి అన్నారు. మోమిన్‌పేట్‌లోని సొసైటీ గోదాం నుంచి రైతులకు సోమవారం యూరియాను పంపిణీ చేశారు. అవసరం మేరకు మాత్రమే యూరియాను వాడాలని, ఎక్కువ వాడటంతో పంటల దిగుబడి తగ్గే అవకాశం ఉంటుందన్నారు. వ్యవసాయ అధికారి పెంటయ్య రైతులకు ఎరువుల వాడకంపై సలహాలు, సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో సొసైటీ సిబ్బంది బాలయ్య, రమేశ్, సురేందర్‌రెడ్డి, మహబూబ్, రైతులు పాల్గొన్నారు.

నేడు తాండూరుకు డిప్యూటీ సీఎం

(మూడో పేజీ తరువాయి)

కార్యకర్తలకు సూచించారు. సోమవారం ఆయన జీపీఆర్ గార్డెన్‌లో ఏర్పాట్లను పరిశీలించారు. అధికారులు, నాయకులతో కలిసి పర్యవేక్షించారు. సభకు వచ్చే ప్రజలకు అసౌకర్యాలు కలగకుండా ఏర్పాట్లు చేయాలని సూచించారు. భోజనాలు చేసే చోట తొక్కిసలాట జరగకుండా ముందు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు.

దౌలాపూర్‌లో ఏర్పాట్ల పరిశీలన

యాలాల మండలం దౌలాపూర్‌లో నేడు అభివృద్ధి పనుల శంకుస్థాపన ఏర్పాట్లను అదనపు కలెక్టర్ లింగ్యానాయక్, సబ్‌కలెక్టర్ ఉమాశంకర్ ప్రసాద్ సోమవారం పరిశీలించారు. ఉపముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్, ఐటీ శాఖ మంత్రి శ్రీధర్‌బాబు రానున్న సందర్భంగా ఎలాంటి ఆటంకాలు లేకుండా ఏర్పాట్లు చేయాలని ఆయన సూచించారు. వారి వెంట తహసీల్దార్ వెంకటస్వామి, ఆర్‌ఐ వేణు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

స్నేహితుడి ఇంటికి వెళ్లనున్న భట్టి

ఈ క్రమంలో ఇంటర్మీడియెట్‌లో ఒకే దగ్గర చదువుకున్న చిన్ననాటి స్నేహితుడి ఇంటికి కూడా ఉప ముఖ్యమంత్రి వెళ్లనున్నారు. ఈ మేరకు ఆయన తాండూరులోని తన స్నేహితుడికి సమాచారం అందించారు. హైదరాబాద్‌లోని అంబేద్కర్ కళాశాలలో యాలాల మండలం జుంటుపల్లి గ్రామానికి చెందిన డాక్టర్ రవిశంకర్ , భట్టి విక్రమార్క ఇంటర్(బైపీసీ) కలిసి చదువుకున్నారు. హైదరాబాద్‌లోనే ఉన్న రవిశంకర్ ఇంటికి కూడా కాలేజీ సమయంలో భట్టి విక్రమార్క అప్పుడప్పుడు వెళ్తుండే వారు. తర్వాత డాక్టర్ రవిశంకర్ ఉన్నత చదువు కోసం ఉస్మానియా యూనివర్సిటీ వెళ్లగా భట్టి విక్రమార్క నిజాం కళాశాలలో బీఏ చదివి ఉన్నత చదువుల కోసం సెంట్రల్ యూనివర్సిటీకి వెళ్లారు. ఇదిలా ఉండగా తాండూరు పర్యటన ఖరారైన సమయంలో భట్టి విక్రమార్క తన క్లాస్‌మెట్ , స్నేహితుడు తాండూరులో ఉంటారని వారిని కలుస్తానని ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డికి తెలియజేశారు.

షెడ్యూల్ ఇలా..

ఉదయం 9 గంటలకు ప్రజాభవన్ నుంచి బయలుదేరి 11 గంటలకు యాలాల మండలం జుంటుపల్లి సీతరామచంద్ర స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహిస్తారు. అనంతరం దౌలాపూర్ వద్ద యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్‌కు, ఆరు విద్యుత్ సబ్ స్టేషన్‌లకు శంకుస్థాపన చేస్తారు. అక్కడి నుంచి మధ్యాహ్నం 12-40కి తాండూరు చేరుకొని పెద్దేముల్ మండలం జీపీఆర్ గార్డెన్‌లో లబ్ధిదారులకు కొత్త రేషన్ కార్డులు పంపిణీ చేస్తారు.


ఏర్పాట్లను పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్, సబ్‌కలెక్టర్

అర్హులైన పేదలందరికీ ఇందిరమ్మ ఇళ్లు


ఘట్‌కేసర్: ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న పావని

ఘట్‌కేసర్, జూలై 28(ఆంధ్రజ్యోతి): అర్హులైన పేదలందరికీ ఇందిరమ్మ ఇళ్లను నిర్మించుకోవడానికి పభుత్వం ఆర్థిక సాయం అందిస్తోందని ఘట్‌కేసర్ మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్ ముల్లి పావని అన్నారు. మున్సిపాలిటీ పరిధిలోని చందుపట్లగూడలో సోమవారం ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనులకు శంకుస్థాపనలు చేశారు. ఇంటి స్థలం లేని వారు సైతం అధైర్యపడొద్దని, వీరికి సైతం ఇళ్లను ఇచ్చేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటున్నదని గుర్తుచేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకుడు మహేశ్‌గౌడ్, ముత్యాలు యాదవ్, మాజీ కౌన్సిలర్లు బొక్క సంగీతాప్రభాకర్ రెడ్డి, మల్లేష్ పాల్గొన్నారు.

కోట్‌పల్లి: ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం పనులు వేగవంతం చేయాలని ఎంపీడీఓ డానియల్ అన్నారు. మండలంలోని ఇందోల్‌లో సోమవారం ఇంటి నిర్మాణానికి ముగ్గు వేసి లబ్ధిదారుకు మంజూరు పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కోట్‌పల్లి మండలానికి 296 ఇందిరమ్మ ఇళ్లు మంజూరైనట్లు తెలిపారు. వీటిలో వంద ఇళ్లకు మార్కింగ్ చేసినట్లు తెలిపారు. 15ఇళ్లు బేస్మెంట్ స్థాయిలో ఉన్నాయన్నారు. బిల్లుల చెల్లింపులో ఎలాంటి జాప్యం ఉండదన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీవో సురేందర్ రెడ్డి, హౌసింగ్ ఏఈ ఉపేందర్ ఉన్నారు.

కులకచర్ల: ఇందిరమ్మ ఇంటి నిర్మాణాలను త్వరగా పూర్తి చేయాలని డీసీసీ ఉపాధ్యక్షుడు భీమ్‌రెడ్డి అన్నారు. కులకచర్లలో సోమవారంఇంటి నిర్మాణాలను పరిశీలించారు. ఇళ్లు మంజూరైన లబ్ధిదారులకు ప్రొసీడింగ్స్ అందజేశారు. ఈ కార్యక్రమంలో ఇందిరమ్మ కమిటీ సభ్యుడు కృష్ణారెడ్డి, మాజీ సర్పంచ్ వెంకటయ్య, ఆనందం, రాంచంద్రయ్య, ఎల్లయ్య, కృష్ణయ్య పాల్గొన్నారు.

అడ్మిషన్ల సంఖ్య పెరగడం అభినందనీయం


మాట్లాడుతున్న ఎంఈవో శంకరయ్య

మేడ్చల్ టౌన్, జూలై 28 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ప్రభుత్వ పాఠశాలల్లో ఈ సంవత్సరం అడ్మిషన్లు సంఖ్యం పెరగడం అభినందనీయమని మేడ్చల్ మండల విద్యాధికారి శంకరయ్య అన్నారు. ఆయన సోమవారం మండలంలోని ప్రభుత్వ పాఠశాలల ప్రధానోపాధ్యాయుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఈవో మాట్లాడుతూ.. మండలంలోని ప్రభుత్వ పాఠశాలల్లో కొత్త అడ్మిషన్లు పెరగటంతో ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థుల సంఖ్య 29,262కు చేరిందన్నారు. ఈ కార్యక్రమంలో మండలంలోని ప్రభుత్వ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు పాల్గొన్నారు.

గురుకులాలను విస్మరించిన ప్రభుత్వం

పరిగి: గురుకుల విద్యాలయాలను కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తి విస్మరించిందని బీజేపీ జిల్లా కార్యదర్శి పెంటయ్య, పట్టణ అధ్యక్షుడు బాల కిష్టారెడ్డిలు విమర్శించారు. పరిగి మునిసిపల్ పరిధిలోని తుంకులగడ్డలోని సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలను సోమవారం ఆయన సందర్శించి సమస్యలను తెలుసుకున్నారు. గురుకుల భవనం శిథిలావస్థకు చేరుకుందన్నారు. బియ్యం, కూరగాయలు మురిగి పోయి ఉన్నాయని తెలిపారు. స్థానిక ఎమ్మెల్యే చొరవ తీసుకుని సమస్యలు పరిష్కరించాలని కోరారు. లేదంటే ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు.

పురుగుల అన్నం పెడుతున్నారని ఫిర్యాదు

నవాబుపేట: మండల కేంద్రంలోని మోడల్ స్కూల్‌లో విద్యార్థులకు పురుగుల అన్నం పెడుతున్నారని బీజేపీ మండల నాయకులు ఆరోపించారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీడీవో అనురాధకు సోమవారం ఫిర్యాదు చేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు చంద్రకాంత్, సారా జగన్, మహేందర్‌రెడ్డి, శ్రీధర్‌రావు, జైపాల్‌రెడ్డి, శ్రీహరిగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్తంగా..

చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలి

కులకచర్ల:యువత చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలని ఎస్ఐ రమేశ్‌కుమార్ అన్నారు. మండలంలోని ముజాహిద్‌పూర్ ఆదర్శ పాఠశాలలో విద్యార్థులకు సోమవారం అవగాహన సదస్సు నిర్వహించారు.

మెరుగైన వైద్య సేవలు అందించాలి

మేడ్చల్ టౌన్: రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని గుండ్లపోచంపల్లి మున్సిపల్ కమిషనర్ అజ్మీరా స్వామి నాయక్ అన్నారు. ఆయన మున్సిపల్ పరిధిలోని కండ్లకోయ బస్తీ దవాఖానా, అంగన్ వాడీ కేంద్రాలను, పాఠశాలలను సోమవారం ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ కార్యక్రమంలో హంసరాణి కృష్ణ గౌడ్, దుర్గా ప్రసాద్ పాల్గొన్నారు.

ఎన్నికల ఇన్‌చార్జిల నియామకం

ధారూరు: రానున్న జడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికల కోసం బీజేపీ మండల ఇన్‌చార్జిలను నియమించింది. జడ్పీటీసీ ఎన్నికల మండల ఇన్‌చార్జిగా సీహెచ్ వెంకటయ్య, ఎంపీటీసీ ఎన్నికల మండల ఇన్‌చార్జిగా నరేందర్‌రెడ్డిలను నియమించినట్లు జిల్లా అధ్యక్షుడు రాజశేఖర్‌రెడ్డి సోమవారం ప్రకటించారు. వీరిద్దరిని శాలువాలతో సన్మానించి అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మండలాధ్యక్షుడు రాజునాయక్ పాల్గొన్నారు.

ముదిరాజ్‌ల సింహగర్జనను జయప్రదం చేయాలి

కొడంగల్: రెడ్డి బసిరెడ్డి గార్డెన్‌లో ఆగస్టు 3వ తేదీన నిర్వహించే సింహ గర్జన బహిరంగ సభను ముదిరాజ్ సోదరులు విజయవంతం చేయాలని ముదిరాజ్ సంఘం రాష్ట్ర నాయకుడు కూర వెంకటయ్య కోరారు.

బాలల విద్య, ఆరోగ్య భద్రతకు ప్రత్యేక చర్యలు

ఘట్‌కేసర్: బాలల విద్య, ఆరోగ్య భద్రత కోసం ప్రభుత్వం పలు చర్యలు తీసుకుంటున్నదని బాలలహక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యురాలు గోగుల సరిత అన్నారు. మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలను సోమవారం ఆమె సందర్శించారు.

ప్రభుత్వ బడులకు చేయూత అభినందనీయం

బొంరాస్‌పేట్: ప్రభుత్వ బడుల బలోపేతానికి స్వచ్ఛంద సంస్థలు చేయూత అభినందనీయమని ఎంఈవో హరిలాల్ అన్నారు. టేకులగడ్డ తండా ప్రాథమిక పాఠశాలలో సోమవారం 20మంది విద్యార్థులకు హరివిల్లు ఫౌండేషన్ ప్రతినిధులు ప్లేట్లు పంపిణీ చేశారు. ఫౌండేషన్ ప్రతినిధులు మురహరి, ప్రధానోపాధ్యాయుడు గోపాల్, నాయకులు పాల్గొన్నారు.

ధారూరులో జూనియర్ కళాశాల ఏర్పాటు చేయాలి

ధారూరు: ధారూరులో ప్రభుత్వ జూనియర్ కళాశాల ఏర్పాటు చేయాలని కోరుతూ సోమవారం సీఆర్‌పీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.జనార్ధన్, జిల్లా అధ్యక్షుడు నాగరాజు, బాధ్యుడు శ్రీనివాస్‌లు కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు.

ఆగస్టు 2న దివ్యాంగుల సదస్సు

ధారూరు: ఆగస్టు 2న జిల్లాలోని కొడంగల్‌లో నిర్వహించే దివ్యాంగుల, పెన్షన్‌దారుల సన్నాహక సదస్సుకు తరలిరావాలని ఎమ్మార్పీఎస్ మండల ఇంచార్జి స్వామిదాస్ తెలిపారు. నాగసమందర్ గ్రామంలో సోమవారం ఆయన దివ్యాంగులు, చేయూత పెన్షన్‌దారులతో మాట్లాడారు.

క్రైం కార్నర్

తప్పిపోయిన బాలుడిని పోలీసులకు అప్పగింత


చెన్‌గోముల్ పోలీస్‌స్టేషన్‌లో ఉన్న బాలుడు ప్రవీణ్‌కుమార్

పూడూరు, జూలై 28 (ఆంధ్రజ్యోతి): తప్పిపోయిన బాలుడిని చెన్‌గోముల్ పోలీసులకు అప్పగించారు. వివరాలిలా ఉన్నాయి. చేవెళ్ల ఆర్టీసీ బస్టాండ్‌లో ప్రవీణ్ అనే ఏడేళ్ల బాలుడు సోమవారం తాండూరు ఆర్టీసీ డిపోకు చెందిన బస్సు ఎక్కాడు. బాలుడి వెంట తల్లిదండ్రులు ఎవరూ లేకపోవడంతో ఆర్టీసీ సిబ్బంది ఆరా తీశారు. ప్రవీణ్ వెంట ఎవరూ లేకపోవడంతో వారు పూడూరు మండల పరిధిలోని చెన్‌గోముల్ పోలీసు స్టేషన్ పోలీసులకు అప్పగించారు. బాలుడిని ఎవరైనా గుర్తిస్తే చెన్‌గోముల్ పోలీసేస్టేషన్‌కు రావాలని వారు కోరారు.

పోలీసుల తనిఖీల్లో తుపాకీ, కత్తులు లభ్యం

పరిగి, జూలై 28 (ఆంధ్రజ్యోతి): పోలీసుల తనిఖీల్లో తుపాకీ, కత్తులు లభ్యమైన ఘటన పరిగి సోమవారం రాత్రి చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళ్తే.. సుల్తాన్‌పూన్‌పూర్ స్టేజి వద్ద పోలీసులు డ్రంకెన్ డ్రైవ్‌లో భాగంగా వాహన తనిఖీలు నిర్వహించగా ఓ బైక్‌పై ముగ్గురు వ్యక్తులు వస్తూ పరారయ్యారు. వారి నుంచి బైక్, ఓబ్యాగ్ కింద పడిపోగా బ్యాగ్‌లో ఒక నాటు తుపాకీ, కత్తులు, ఇనుపరాడ్లు, స్క్రూడ్రైవర్లు లభించాయి. బ్యాగ్‌తోపాటు, వారు వాడిన బైక్‌ను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. బైక్‌పై వెళుతున్న ముగ్గురు వ్యక్తులు పోలీసులు దొంగలుగా భావిస్తున్నారు. వీరు సుల్తాన్‌పూర్ గ్రామం మీదుగా బయటకు పారిపోయినట్లు గుర్తించారు. వారి కోసం పోలీసులు ప్రత్యేక బృందాలతో గాలిస్తున్నారు.

చికిత్స పొందుతూ యాచకురాలి మృతి

పరిగి, జూలై 28 (ఆంధ్రజ్యోతి): కారు ఢీకొని ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న ఓయాచకురాలు మృతిచెందింది. పూడూరు మండలం తుర్కఎన్కెపల్లికి చెందిన యాచకురాలు శంకరమ్మ(55) ఏడాదికాలంగా పరిగి మండలం రాఘవాపూర్ గ్రామ స్టేజి దగ్గర ఉంటోంది. రాఘవాపూర్ స్టేజి దగ్గర అంబేడ్కర్ విగ్రహం దగ్గర పడుకొని ఉన్న యాచకురాలిని, అదే గ్రామానికి చెందిన సుధాకర్ అనే వ్యక్తి కారు ఢీకొట్టింది. తీవ్ర గాయాలైన యాచకురాలిని చికిత్స నిమిత్తం నగరానికి తరలించగా ఉస్మానియాలో చికిత్సపొందుతూ సోమవారం మృతి చెందింది. ఈ మేరకు పరిగి పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

భూవివాదం కేసులో ఐదుగురి బైండోవర్

దుద్యాల, జూలై 28 (ఆంధ్రజ్యోతి): భూవివాదం కేసులో ఐదుగురిని దుద్యాల తహసీల్దార్ కిషన్‌నాయక్ ముందు సోమవారం పోలీసులు బైండోవర్ చేశారు. మండలంలోని సత్తర్‌కుంట పరిధిలోని బొల్లిబాయి తండాకు చెందిన ఇట్యానాయక్, ప్రవీణ్ చౌహన్, రాహుల్, బాబ్యానాయక్, అనుబాయిలను బైండోవర్ చేసినట్లు ఎస్ఐ యాదగిరి తెలిపారు. బైండోవర్‌ను ఉల్లంఘిస్తే జరిమానా విధిస్తామని హెచ్చరించారు.

ఆరు మేకల అపహరణ

దోమ, జూలై 28 (ఆంధ్రజ్యోతి): మండలంలోని దిర్శంపల్లి తండాలో కేతావత్ గేమ్యానాయక్ పొలం దగ్గర ఉన్న మేకల పాకలో ఆదివారం రాత్రి ఆరు మేకలను గుర్తుతెలియని దుండగులు అపహరించారు. రైతు గేమ్యానాయక్ కుటుంబం పొలం పనులు, మేకలను మేపుతూ జీవనం కొనసాగిస్తున్నారు. బతుకుదెరువు కోసం ఉన్న మేకలు దొంగిలించారని బాధిత రైతు వాపోయాడు. వాటి విలువ రూ.లక్ష వరకు ఉంటుందని తెలిపాడు. మేకలు అపహరించిన దుండగులను గుర్తించి పోలీసులు చర్యలు తీసుకోవాలని దోమ పోలీస్‌స్టేషన్‌లో సోమవారం ఫిర్యాదు చేశాడు.

కేటీఆర్‌ను కలిసిన శుభప్రద్‌పటేల్



వికారాబాద్, జూలై 28 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ బీసీ కమిషన్ మాజీ సభ్యుడు శుభప్రద్ పటేల్ జన్మదిన సందర్భంగా బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్‌ను సోమవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయనను కేటీఆర్ శాలువాతో సన్మానించి అభినందించారు. ఈ సందర్భంగా ఆయన వెంట వికారాబాద్ బీఆర్ఎస్ నాయకులు కిషోర్, నయీమ్, సిద్దిఖీ, రాము ఉన్నారు.

పారిశుధ్య పనులు చేపట్టాలి


వినతిపత్రం అందజేస్తున్న శ్రీనివాస్

బషీరాబాద్, జూలై 28 (ఆంధ్రజ్యోతి): గ్రామంలో పారిశుధ్య చర్యలు చేపట్టాలని అల్లాపూర్ గ్రామవాసి గొట్టిగశ్రీనివాస్ సోమవారం బషీరాబాద్ ఎంపీవో విజయ్‌కుమార్‌కు కలిసి విన్నవించారు. కొన్నేళ్లుగా వర్షాకాలంలో పెంట కుప్పలతో నానా అవస్థలు పడుతున్నామన్నారు. దోమలు విజృంభిస్తుండటంతో డెంగీ, జ్వరాలతో మా కుటుంబ సభ్యులతో పాటు స్థానిక ప్రజలు ఆస్పత్రుల పాలవుతున్నరన్నారు. గ్రామ ప్రత్యేకాధికారి, కార్యదర్శికి విన్నవించినా ఎవరూ పట్టించుకోవడంలేదన్నారు. ఎంపీవోకు రాత పూర్వకంగా వినతిపత్రం అందజేశారు. స్పందించిన ఆయన రెండు, మూడు రోజుల్లో తగిన చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చినట్లు ఆయన తెలిపారు.

ఉపాధ్యాయ సమస్యల పరిష్కారమే ధ్యేయం

కులకచర్ల, జూలై 28 (ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయుల సమస్యల సాధనే పీఆర్‌టీయూ ధ్యేయమని మండల అధ్యక్షుడు రాఘవేందర్ రెడ్డి అన్నారు. పాంబండ ఆలయ ఆవరణలో సోమవారం ఉపాధ్యాయులతో సభ్యత్వ నమోదు చేయించారు. ఈ కార్యక్రమంలో మండల ప్రధాన కార్యదర్శి బస్వరాజ్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు శ్రీశైలం, ఆనందం, నర్సిములుగౌడ్ పాల్గొన్నారు.

సెప్టెంబరు 1న పీఆర్‌టీయూ ధర్నా

మోమిన్‌పేట్: సీపీఎస్ రద్దు కోరుతూ సెప్టెంబరు 1న హైదరాబాద్‌లోని ఇందిరా పార్కు దగ్గర మహాధర్నా నిర్వహించనున్నట్లు పీఆర్‌టీయూ మండల అధ్యక్షుడు చంద్రశేఖర్ అన్నారు. మండలంలోని పాఠశాలల ఉపాధ్యాయులతో కలిసి సోమవారం సీపీఎస్ రద్దు కోసం మహాధర్నాలో పాల్గొనాలని పిలుపునిచ్చారు. అదేవిధంగా ఉపాధ్యాయులతో సభ్యత్వ నమోదు చేయించారు.

మెనూ ప్రకారం భోజనం అందించాలి


విద్యార్థులతో కలిసి భోజనం చేస్తున్న అధికారులు

కులకచర్ల, జూలై 28 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులకు మెనూ ప్రకారం భోజనం అందించాలని ఎంపీడీవో రామకృష్ణ అన్నారు. స్థానిక కేజీబీవీ పాఠశాలను సోమవారం ఎంఈవో హబీబ్ అహ్మద్, వైద్యాధికారి కిరణ్ కుమార్‌గౌడ్‌తో కలిసి పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ దేవి, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.